అంగన్ వేడి..!

మంత్రి పెద్దిరెడ్డిని తాకిన సెగ

ఉరవకొండలో కాన్వాయ్ అడ్డగింత



పోలీసుల నోటీసు

అనంతపురం విద్య, జనవరి 20: అంగన్‌వాడీల సమ్మె సెగలు మరింత వేడెక్కాయి. జిల్లా వ్యాప్తంగా 40 రోజుల నుంచి అనేక రూపాల్లో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు.. శనివారం దూకుడు పెంచారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాన్వాయ్‌ని ఉరవకొండలో అడ్డుకున్నారు. పోలీసుల రక్షణ కంచెను ఛేదించుకుని మంత్రి కాన్వాయ్‌ను తాకారు. అనంతపురంలో జాతీయ రహదారిపై బైఠాయించారు. మరోవైపు షోకాజ్ నోటీసులకు ఇచ్చిన 10 రోజుల గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ ఐసీడీఎస్ పీడీ కార్యాలయ అధికారులు, ప్రాజెక్టు సీడీపీఓల నుంచి కార్యకర్తలు, ఆయాలకు ఫోన్ కాల్స్ వెళ్లాయి. 'విధులలో చేరకుంటే మీ ఇష్టం..' అనే బెదిరింపులు పెరిగాయి. దీంతో కొందరు విధుల్లో చేరారు. వేలాది మంది ఇంకా సమ్మెలోనే ఉన్నారు. అధికారుల బెదిరింపులపై యూనియన్ నేతలు మండిపడ్డారు.



సొమ్మసిల్లి పడిపోయిన అంగన్‌వాడీ కార్యకర్త



ఉరవకొండలో మంత్రి పెద్దిరెడ్డి కాన్వాయ్‌ని ముట్టడించిన అంగన్‌వాడీలు →





అనంతపురం తపోవనంలో హైవేపై అంగన్‌వాడీల రాస్తారోకో

ముఖ్యమంత్రిని అడ్డగిస్తాం: నాగేంద్ర

అంగన్‌వాడీల సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే సీఎం జగన్ జిల్లా పర్యటనను అడ్డుకుంటామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర హెచ్చరించారు. ఈ నెల 23న జిల్లాలో సీఎంను అడ్డగిస్తామని ఆయన అన్నారు. అంగన్‌వాడీలు 40 రోజులుగా సమ్మె చేస్తున్నా స్పందించడం లేదని మండిపడ్డారు. ఆరుసార్లు చర్చలు జరిపిన మంత్రులు.. జీతాలు పెంచమని ఒకసారి, జూలైలో పెంచుతామని మరోసారి అంటున్నారని విమర్శించారు. జీతాలు ఎంతపెంచుతారో స్పష్టం చేయాలని, లేకుంటే సమ్మె విరమించబోమని అన్నారు.

ఉరవకొండకు వెళ్లొద్దు..

సీఎం జగన్ పర్యటనను అడ్డుకుంటామని అంగన్‌వాడీలు ప్రకటించడంతో పోలీసులు నోటీసులు ఇస్తున్నారు. సీఎం పర్యటన ముట్టడికి అనుమతి లేదని, అక్కడికి వెళితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ.. పోలీసులు నోటీసులు జారీ చేస్తున్నారు.



అనంతలో జాతీయ రహదారిపై బైఠాయింపు
షోకాజ్ నోటీసులకు ముగిసిన గడువు
విధుల్లో చేరకుంటే ఉద్యోగాలు ఊడుతాయ్..!
పీడీ కార్యాలయం, సీడీపీఓల నుంచి వార్నింగ్ కాల్స్
23న సీఎం జగన్ పర్యటన..
అంగన్‌వాడీలకు నోటీసులు

దడ పుట్టించిన అంగన్‌వాడీలు

జిల్లా వ్యాప్తంగా మెరుపు నిరసనలతో అంగన్‌వాడీలు దడ పుట్టించారు. ఉరవకొండలో మంత్రి పెద్దిరెడ్డి కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. వందలాది మంది పోలీసులు రక్షణగా నిలబడినా.. మంత్రి వాహనాలను ముందుకు పంపలేకపోయారు. సమస్యలను పరిష్కరించే దాకా కదలనిచ్చేది లేదని అంగన్‌వాడీలు బైఠాయించడంతో పోలీసులు వారిని లాగిపడేశారు. బలవంతంగా తోసేశారు. వాహనం లోంచి మంత్రి కాలు కిందమోపలేదు. దీంతో అంగన్‌వాడీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అనంతపురం తపోవనంలో హైవేపై సీఐటీయూ నాయకులు రాస్తారోకో చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నాగేంద్ర ఆధ్వర్యంలో నాయకులు నాగమణి, రామిరెడ్డి, ఆర్వీనాయుడు, వెంకటనారాయణ, ముత్తుజ, గోపాల్, అరుణ, రుక్మిణి, ఏఐటీయూసీ నాయకులు రాజేష్ గౌడ్, కృష్ణుడు తదితరులు బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాస్తారోకోతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. కిలోమీటరు మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో పోలీసులు నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో వాగ్వాదం, తోపులాట జరిగింది.



అనంతలో పోలీసు వాహనం అడ్డగింత



ఉరవకొండలో అంగన్‌వాడీ కార్యకర్తలను లాగేస్తున్న సీఐ

ఈ ప్రభుత్వం కూలిపోతుంది: కేశవ్

ఉరవకొండ: రాబోవు 80 రోజుల్లో ఈ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. ఉరవకొండలో పోలీసులు తోసెయ్యడంతో గాయపడిన అంగన్‌వాడీ కార్యకర్తలను దీక్ష శిబిరంలో ఆయన పరామర్శించారు. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకులకు గోడు వినిపించే హక్కు కూడా అంగన్‌వాడీలకు లేదా అని ప్రశ్నించారు. పోలీసుల తీరు దుర్మార్గమని అన్నారు. పోలీసులతో పాటు బయటి వ్యక్తులు కూడా అంగన్‌వాడీ కార్యకర్తలను నెట్టేశారని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎవరి చేతిలో ఉన్నాయో అర్థం కావడం లేదని అన్నారు. అంగన్‌వాడీల సమస్యలను వినకుండా మంత్రి వెళ్లిపోవడం దారుణమని అన్నారు.



గాయపడిన కార్యకర్తలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేశవ్

హక్కుల సాధనలో తగ్గొద్దు: రాంభూపాల్



శిబిరంలో మాట్లాడుతున్న రాంభూపాల్

పామిడి: 'హక్కుల సాధనలో తగ్గొద్దు.. విధుల్లో చేరొద్దు' అని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ పిలుపునిచ్చారు. పామిడిలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పంతానికిపోయి అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగులగొట్టించిందని, వాటిని నిర్వహించే సామర్థ్యం లేనప్పుడు తాళాలను ఎందుకు పగులగొట్టారని ప్రశ్నించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సచివాలయ సిబ్బందికి తలకు మించిన భారంగా మారిందని అన్నారు. రాష్ట్రంలో చిట్ట చివరి ఉద్యోగికి రూ.24,750 నెల జీతం వస్తుందని, అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేల జీతం పెంచడంమీద ఉన్న శ్రద్ధ అంగన్‌వాడీల జీతాలు పెంచడంపై ఎందుకు లేదని నిలదీశారు. ఎస్మా ప్రయోగించినా 5 శాతం అంగన్‌వాడీలు కూడా విధుల్లో చేరలేదని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు అంగన్‌వాడీల సమ్మెపై హర్షం వ్యక్తంచేస్తున్నారని, అంగన్‌వాడీలను తొలగించే ధైర్యం ప్రభుత్వానికి లేదని అన్నారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు అనిమిరెడ్డి, మండల కార్యదర్శి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



మానవహారంగా ఏర్పడిన అంగన్‌వాడీలు

ఫోన్లలో బెదిరింపులు

అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలకు ఐసీడీఎస్ పీడీ కార్యాలయం నుంచి, 11 ప్రాజెక్టుల సీడీపీఓల నుంచి ఫోన్‌కాల్స్ వెళుతున్నాయి. డిసెంబరు 12 నుంచి అంగన్‌వాడీలు సమ్మెలోకి వెళ్లారు. అప్పటి నుంచి జనవరి 9వ తేదీ వరకూ విధులకు ఎందుకు హాజరు కాలేదో చెప్పాలని ఈ నెల 10, 11 తేదీల్లో అంగన్‌వాడీలకు నోటీసులు ఇచ్చారు. ఉద్యోగాల్లోంచి ఎందుకు తొలగించకూడదో పది రోజుల్లో చెప్పాలని గడువు విధించారు. ఆ గడువు శనివారం ముగియడంతో బెదిరింపులకు దిగారు. విధుల్లో చేరకుంటే ఉద్యోగాలు ఊడిపోతాయని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొందరు వర్కర్లు, ఆయాలు విధుల్లో చేరినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల చేరికపై సమాచారం సేకరించి, ఆర్డీఓలకు నివేదిస్తున్నారు. వేలాది మంది వర్కర్లు, ఆయాలు ఇంకా సమ్మెలోనే ఉన్నారు. మరో 48 గంటల్లో జిల్లాలో సీఎం పర్యటన ఉంది. ఆయనను అడ్డుకుంటామని అంగన్‌వాడీలు, నాయకులు ప్రకటించారు. దీంతో హీట్ పెరిగింది.

ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో నిలిచిపోయారు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో పురందేశ్వరి, పయ్యావుల, గోనుగుంట్ల

ఉరవకొండ, జనవరి 20: ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచిపోయారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ఎమ్మెల్యే కేశవ్‌తో కలిసి ఆమె ఉరవకొండలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంతకుమునుపు పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఉరవకొండలో ఎద్ల బండ్లపై ఊరేగింపుగా ఆమెను ఎన్టీఆర్ విగ్రహం వరకూ తీసుకెళ్లారు. అనంతపురం-బళ్లారి జాతీయ రహదారిలో డి.సౌభాగ్య, శ్రీరామ్, దగ్గుబాటి యుగంధర్, చంద్రమౌళి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని పురందేశ్వరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్టీఆర్ తన జీవితాన్ని సమాజంలోని పేదలకు అంకితం చేశారని అన్నారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటిన వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. సినీ రంగంలో అనితర సాధ్యమైన ఎన్నో పాత్రలను ఆయన పోషించారని అన్నారు. ఆయన వ్యక్తి కాదని, ఒక ప్రభంజనం అని అన్నారు. సంక్షేమ పథకాలకు నిర్వచనం ఎన్టీఆర్ అని అన్నారు. ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, సంక్షేమ పథకాలకు బ్రాండ్ ఎన్టీఆర్ అని అన్నారు. పేదవాడికి పట్టెడు అన్నం పెట్టాలన్నదే ఆయన సిద్ధాంతమని అన్నారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ఎన్టీఆర్ ఎంతగానో కృషిచేశారని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్‌కే జై అనాల్సిన పరిస్థితులు నేటికీ ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి, టీడీపీ నాయకులు శ్రీధర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



ఘన స్వాగతం..

ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు

మర్రిమాకులపల్లిలో ఎంపీకి నీటి సెగ

కళ్యాణదుర్గం/రూరల్/ఉరవకొండ, జనవరి 20: ఇంకా వేసవి రానేలేదు. అప్పుడే నీటికోసం జనం రోడ్డెక్కుతున్నారు. ఖాళీ బిందెలతో ఆందోళనకు దిగుతున్నారు. వజ్రకరూరు, కళ్యాణదుర్గం, కంబదూరు మండలాలలో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. ఆరు నెలలుగా తాగునీటికోసం ఇబ్బంది పడుతున్నామని, గుక్కెడు నీరు ఇస్తారో లేదో చెప్పాలని ఎంపీ తలారి రంగయ్యను మహిళలు నిలదీశారు. కంబదూరు మండలం మర్రిమాకులపల్లిలో ఎంపీ శనివారం పర్యటించారు. రచ్చబండ వద్ద మహిళలు ఎంపీని నిలదీశారు. మూడువేల జనాభా ఉన్న గ్రామంలో బోరుబావులు ఎండిపోయాయని, శ్రీరామరెడ్డి తాగునీటి పథకం నీరు అరకొరగా వస్తోందని మహిళలు వాపోయారు. ఆరు నెలల నుంచి బిందెడు నీటి కోసం వ్యవసాయ బోరుబావుల చుట్టూ తిరుగుతున్నామని అన్నారు. 'మా కష్టాలు ఏ ఒక్క ప్రజాప్రతినిధీ పట్టించుకోలేదు. మీరైనా పరిష్కరించండి. ఉత్త హామీ కాదు.. తక్షణ పరిష్కారం చూపించండి' అని డిమాండ్ చేశారు. దీంతో స్పందించిన ఎంపీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అప్పుడే నీటిపోరాటం..!



కళ్యాణదుర్గంలో రాస్తారోకో



కంబదూరు మండలం మర్రిమాకులపల్లిలో ఎంపీ తలారి రంగయ్యను నిలదీస్తున్న మహిళలు





కళ్యాణదుర్గంలో మహిళలకు నచ్చజెప్పుతున్న పోలీసులు

రోడ్డెక్కిన మహిళలు

కళ్యాణదుర్గం పట్టణంలో ఎన్టీఆర్ కాలనీవాసులు తాగునీటి కోసం ఆర్డీటీ ఆస్పత్రికి ఎదురుగా ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఖాళీ బిందెలతో ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నెల రోజులుగా తాగునీటి కోసం అల్లాడుతున్నామని వాపోయారు. రెండు కిలోమీటర్లు వెళ్లి ఉప్పు నీరుతెచ్చుకుని కాలం గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీరామిరెడ్డి నీటిపథకం కార్మికులకు జీతాలు ఇస్తే కదా వారు నీరు సరఫరా చేసేది అని విమర్శించారు. తమ కౌన్సిలర్ కాలనీవైపు కన్నెత్తి చూడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు తమ గోడు పట్టించుకోవట్లేదని అన్నారు. మహిళల ఆందోళనతో రహదారిపై గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.



ఖాళీ బిందెలతో నిరసన

వజ్రకరూరు మండలం చాబాల సచివాలయం వద్ద మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. 15 రోజులుగా నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నా అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో ఊరు దేవర ఉందని, అధికారులు తక్షణమే స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచు ఎర్రిస్వామి వారికి మద్దతు తెలిపారు.

రేపు ఓటర్ల తుది జాబితా



ఓటర్ల జాబితాపై సమీక్షిస్తున్న పరిశీలకులు మురళీధర్‌రెడ్డి

అనంతపురం టౌన్, జనవరి 20: ఓటర్ల తుది జాబితాను జిల్లా స్థాయి నుంచి పోలింగ్ కేంద్రం స్థాయి వరకూ ప్రదర్శించాలని ఎలక్షన్ రోల్ పరిశీలకులు మురళీధర్ రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం జేసీ కేతన్ గార్గ్, డీఆర్వో గాయత్రీదేవి, ఆర్డీఓలు, నియోజకవర్గ ఎన్నికల అధికారులతో ఆయన ఓటరు తుది జాబితాపై సమీక్ష నిర్వహించారు. ఈ నెల 22న ఓటరు తుది జాబితా విడుదల చేయాలని, ఆ వెంటనే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి వారికి రెండు సెట్ల ఓటరు జాబితాను ఇవ్వాలని ఆదేశించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ప్రతి అంశంపైనా సమాచారం ఇవ్వాలని సూచించారు. ఓటర్లకు ఇబ్బంది కలగకుండా పోలింగ్ కేంద్రాల ఏర్పాటులోను నిబంధనలను పాటించాలని అన్నారు. ఒకే లోకేషన్‌లో నాలుగుకు మించి పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయరాదని అన్నారు. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించి, ప్రజలలో ఓటు హక్కుపై చైతన్యం పెంచాలని సూచించారు. ఎక్కడ ఎవరు తప్పుచేసినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

జగన్‌ను సాగనంపుదాం..!

ముస్లింలకు షరీఫ్ పిలుపు

అనంతపురం అర్బన్, జనవరి 20: ముస్లిం మైనార్టీలు ఏకమై వచ్చే ఎన్నికల్లో వైసీపీని సాగనంపాలని శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ పిలుపునిచ్చారు. గుత్తి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో అనంతపురం అర్బన్ నియోజకవర్గ ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క చాన్స్ పేరుతో సీఎం జగన్ ముస్లిం మైనార్టీలను మోసం చేశారని మండిపడ్డారు. టీడీపీ హయాంలో ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యం లభించిందని అన్నారు. 50 శాతం సబ్సిడీతో రుణాలు, విదేశీ విద్య, దుల్హన్, రంజాన్ తోఫా తదితర సంక్షేమ పథకాలు అమలయ్యాయని అన్నారు. షాదీఖానా, మసీదుల నిర్మాణం, మరమ్మతులకు నిధులు కేటాయించామని అన్నారు. టీడీపీ హయాంలో రూ.5వేల కోట్లను ముస్లిం మైనార్టీల కోసం ఖర్చు చేశామని అన్నారు. వైసీపీ పాలనలో ఒక్క పైసా ఖర్చు చేయలేదని విమర్శించారు. అధికారంలోకి రాగానే ఇస్లామిక్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసి ముస్లింలను ఆదుకుంటామని నమ్మబలికి, అమలు చేయలేదని అన్నారు. సీఎం జగన్ బీజేపీతో కుమ్మక్కయ్యారని, ముస్లింల వ్యతిరేక బిల్లులకు మద్దతునిచ్చారని అన్నారు. వైసీపీ నాయకుల అరాచకాలు తట్టుకోలేక అనేక మంది ముస్లింలు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. జగన్ పాలనపై అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారని, ఆయన రక్తం పంచుకొని పుట్టిన షర్మిల కూడా ఆయన్ను ఓడించేందుకు సిద్ధమయ్యారని అన్నారు.

● వైసీపీకి అధికారం కట్టబెట్టడంతో పిచ్చోడి చేతికి రాయిచ్చినట్లు అయ్యిందని మాజీ మంత్రి ఫరూక్ విమర్శించారు. ముస్లింలను నట్టేట ముంచిన జగన్‌కు రాబోవు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి అనంత అభివృద్ధికి పాటుపడ్డారని అన్నారు. ఆయన నిర్వహించిన జన్మభూమి కార్యక్రమం ఇతర ప్రాంతాలకు స్ఫూర్తినిచ్చిందని అన్నారు.



మైనార్టీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న షరీఫ్

● ముస్లింలకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి అన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నప్పుడు నగరంలో నాలుగు చోట్ల మసీదులకు స్థలాన్ని కేటాయించానని అన్నారు. గాంధీ బజార్‌లో ఇరుకు సందులను దృష్టిలో ఉంచుకొని చెరువు కట్ట మీద రోడ్డు వేయించామని అన్నారు. అధికారంలోకి రాగానే అక్కడి నుంచి ఆర్టీసీ బస్టాండుకు రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారు. తాను ఎమ్మెల్యే హోదాలో అసెంబ్లీలో 80సార్లు ప్రజల సమస్యలపై మాట్లాడానని, అనంత వెంకటరామిరెడ్డి ఎంపీ, ఎమ్మెల్యే హోదాలో ఎక్కడా ప్రజల పక్షాన మాట్లాడలేదని అన్నారు. అలాంటి వ్యక్తి అనంతను అభివృద్ధి చేశానంటున్నారని విమర్శించారు. అర్బన్‌లో ఇతర సామాజికవర్గాలకు పలుసార్లు టీడీపీ ఎమ్మెల్యే సీటు కేటాయించిందని, ఇతర పార్టీలు కేవలం ఒకే సామాజికవర్గానికే ప్రాధాన్యం ఇస్తున్నాయని విమర్శించారు. సమావేశంలో అర్బన్ పరిశీలకులు రమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చాంద్‌బాషా, నాయకులు సాలార్ బాషా, పీర్వేస్‌తాజ్, సైఫుద్దీన్, ముక్తియార్, అజీజ్, ఫిరోజ్, జేఎం బాషా, డిస్కోబాబా, హసీనా తదితరులు పాల్గొన్నారు.

బైసీపీ

కదిరి వైసీపీ కేడర్ కుతకుత.. టీడీపీలోకి వెళ్తున్న నాయకులు

బుజ్జగింపులు ప్రారంభం.. మద్దతు కోరితే మనీ అడుగుతున్న కొందరు

కొత్త ఇన్‌చార్జికి చుక్కలు చూపుతున్న వైనం

పరిస్థితిని చక్కదిద్దేందుకు మంత్రి పెద్దిరెడ్డి యత్నం



టీడీపీలోకి చేరిన వాల్మీకి పవన్(ఫైల్)

కదిరి, జనవరి 20: పార్టీ, ప్రభుత్వ విధానాలతో విసిగిపోయిన పలువురు నాయకులు టీడీపీలోకి వలసలు వెళ్తున్నారు. దీన్ని ఆపడానికి వైసీపీ అధిష్ఠానం సామ, దాన, భేద, దండోపాయాలు మొదలు పెట్టినట్లు సమాచారం. ఈక్రమంలోనే శనివారం కదిరిలో పర్యటించిన మంత్రి పెద్దిరెడ్డి వైసీపీ నాయకులు వెంకటరమణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కడపల మోహన్‌రెడ్డితో చర్చించారు. అయితే స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పీవీ.సిద్ధారెడ్డి మాత్రం మంత్రిని కలవకుండా ముఖం చాటేసినట్లు తెలిసింది. శనివారం మధ్యాహ్నం వరకు పట్టణంలో ఉన్నా మంత్రిని కలవకుండా సొంత పనుందంటూ బయటకు వెళ్లినట్లు సమాచారం.

టీడీపీలోకి పెరిగిన వలసలు

గత రెండు నెలల నుంచి నియోజకవర్గంలోని అన్ని మండలాలనుంచి వలసలు మొదలయ్యాయి. వైసీపీ తలుపుల మండల కన్వీనర్ శంకర్ గతంలోనే టీడీపీలో చేరగా, తాజాగా పవన్‌కుమార్‌రెడ్డి సైకిల్ ఎక్కారు. ఆయనతోపాటు 14వ వార్డు ఇండిపెండెంట్ కౌన్సిలర్ మహబూబ్‌బాషా, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గరికిపల్లి రామక్రిష్ణారెడ్డి, రెండురోజులక్రితం టీడీపీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. ప్రతిరోజు నియోజకవర్గంలో ఏదో ఒక మండలం నుంచి కుటుంబాలతో కలిసి టీడీపీలో చేరుతున్నారు. మరికొంతమంది ముఖ్య నాయకులు కూడా టీడీపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

నష్ట నివారణ కోసం వైసీపీ యత్నం

నియోజకవర్గంలో టీడీపీలోకి పెరిగిన వలసలు చూసి, వైసీపీ నష్టనివారణ చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఈక్రమంలో ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ పేరుతో కొంతమంది నాయకులను తాడేపల్లికి పిలిపించినట్లు తెలిసింది. వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త బత్తల హరిప్రసాద్, మైనార్టీ నాయకుడు ఇస్మాయిల్ గత మూడురోజులనుంచి ముఖ్యమంత్రిని కలవడం కోసం అక్కడే ఉన్నట్లు అనుచరులు చెబుతున్నారు. బత్తల హరిప్రసాద్ తల్లిదండ్రులతో టీడీపీ నాయకులు ఇప్పటికే చర్చలు జరిపారు. పార్టీని వీడేది ఖాయమంటూ ప్రచారాలుకూడా జరుగుతున్నాయి. బీసీ నాయకులు చేజారిపోకుండా ఎంపీ మిథున్‌రెడ్డి ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు సమాచారం. మైనార్టీ నాయకుడు ఎస్ఎండీ ఇస్మాయిల్‌ను కూడా బుజ్జగించడానికి పిలిపించినట్లు సమాచారం. మైనార్టీ సీనియర్ నాయకుడిగా, వైసీపీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న ఆయన ఎమ్మెల్యే టిక్కెట్‌ను ఆశిస్తున్నారు. గత రెండు ఎన్నికల్లో ఆయనకు వైసీపీ అధిష్ఠానం మొండిచేయి చూపింది. ఈఎన్నికల్లో అయినా టిక్కెటు దక్కుతుందన్న ఆయన ఆశలు ఆడియాశలయ్యాయి. ఆయనను కాదని, మక్బూల్ బాషాను ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో బాహాటంగానే ఆయన తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. మొత్తం మీద వైసీపీ అధిష్ఠానం తమ పార్టీ నాయకులు చేజారిపోకుండా బుజ్జగింపులు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది.



మాజీ ఎమ్మెల్యే కడపల మోహన్‌రెడ్డితో చర్చిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పైసలిస్తేనే మద్దతు !

ఇటీవల కదిరి నియోజకవర్గానికి వైసీపీ ఇన్‌చార్జిగా మక్బూల్ బాషాను నియమించారు. ఆయనకు ఎమ్మెల్యే సిద్దారెడ్డి మద్దతుదారులు పూర్తిగా సహకరించలేదని సమాచారం. వారిలో కొంతమందిని మద్దతు కోసం కలిసినప్పుడు తాము ఖర్చులు పెట్టామని, ఆ డబ్బులివ్వాలని అడుగుతున్నట్లు తెలిసింది. తలుపుల మండలంలోని ఓ నాయకుడు ఏకంగా రూ.రెండుకోట్లు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. దీంతో ఆయన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డివద్ద ఈ విషయాన్ని ఏకరువు పెట్టినట్లు తెలిసింది. మొత్తం మీద కొత్తగా వచ్చిన ఇన్‌చార్జికి స్థానిక నాయకులు చుక్కలు చూపుతున్నట్లు తెలిసింది. ఈ ఇబ్బందులు తట్టుకోలేక నాకు ఈరాజకీయమే వద్దు అన్నట్లు సమాచారం. అయితే మంత్రి ధైర్యం చెప్పి, తాను పర్యటించి అన్ని సర్దుకునేలా చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

దండోపాయాలతో అయినా దారికి తెచ్చుకోవాలని..

ఎమ్మెల్యే వర్గీయులు కొత్త ఇన్‌చార్జికి సహకరించకపోవడంతో వారిని సామ, దాన, దండోపాయలతో అయినా దారికి తెచ్చుకోవాలని అధిష్ఠానం చూస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగానే ఇటీవల వైసీపీ నాయకుడు రమేష్‌రెడ్డి, వెంకటరమణారెడ్డికి సంబంధించిన ఫ్యాక్టరీల్లో తనిఖీలు చేయించారు. అలాగే ఇటీవల టీడీపీలోకి చేరిన వాల్మీకి పవన్‌కుమార్‌రెడ్డి పాఠశాలపైన విద్యాశాఖాధికారులచే దాడులు చేయించినట్లు చెబుతున్నారు. ఆర్థికంగా బలంగా ఉన్నవారిపై అధికారాన్ని ఉపయోగించి దారికి తెచ్చుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. కొంతమంది కౌన్సిలర్లపై కూడా ఇదేరకమైన ప్రయోగం చేస్తున్నట్లు సమాచారం.

మంత్రికి ముఖం చాటేసిన ఎమ్మెల్యే

మంత్రిపెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కదిరికి వస్తున్నారని, ఇంటికొచ్చికలుస్తారని, మంత్రి స్థానిక ఎమ్మెల్యే సిద్దారెడ్డికి సమాచారం పంపినట్లు తెలిసింది. తాను ఉండటం లేదని, సొంత పనిమీద బయటకు వెళ్తున్నట్లు మంత్రికి ఎమ్మెల్యే తిరిగి సమాచారం పంపినట్లు తెలిసింది. మొత్తం మీద మంత్రిని కలవకుండా ముఖం చాటేసినట్లు సమాచారం.

తాడేపల్లిలో తనయుడు, కదిరిలో తండ్రి

వైసీపీలో కదిరి ఇన్‌చార్జి మార్పు తరువాత చోటుచేసుకున్న పరిణామాలను సరిచేయడానికి మంత్రి పెద్దిరెడ్డి కదిరిలో కొంతమంది నాయకులను, ఆయన తనయుడు ఎంపీ మిథున్‌రెడ్డి తాడేపల్లిలో కొంతమంది నాయకులను బుజ్జగిస్తున్నట్లు సమాచారం. మంత్రి పెద్దిరెడ్డి శనివారం వైసీపీ నాయకులు, కాంట్రాక్టర్లు అయినా వెంకటరమణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలను కలిశారు. పార్టీకి పనిచేయాలని కోరారు. అయితే తమ ఫ్యాక్టరీపై జరిగిన రైడ్‌ల గురించి మంత్రిని నిలదీసినట్లు సమాచారం. పలు వాదనల అనంతరం మంత్రి మాట్లాడుతూ మనస్సులో ఏమీ ఉంచుకోకుండా కలిసి పనిచేయాలని కోరినట్లు తెలిసింది. అలాగే మాజీ ఎమ్మెల్యే కడపల మోహన్‌రెడ్డిని కూడా ఆయన నివాసంలో కలిసి, పార్టీకి పనిచేయాలని కోరినట్లు సమాచారం.



మార్కెట్‌కు వచ్చిన చీనీ కాయలు

చీనీ మార్కెట్ ప్రారంభం

అనంతపురం రూరల్, జనవరి 20: నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో చీనీ మార్కెట్ శనివారం పునః ప్రారంభమైంది. చీనీకాయలు రాకపోవడంతో మూడు నెలలుగా మార్కెట్‌ను బంద్ చేశారు. శనివారం మార్కెట్‌కు నాలుగు టన్నుల చీనీ కాయలు వచ్చాయి. టన్ను గరిష్ఠ ధర రూ.25వేలు, సరాసరి రూ.20వేలు, కనిష్ఠ ధర రూ.16వేలు పలికినట్లు మార్కెట్ యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్ ప్రారంభమైందన్న విషయాన్ని రైతులు గమనించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తాడిపత్రిటౌన్, జనవరి20: పట్టణంలోని శివాలయం రోడ్డు శ్రీ సత్యసాయి సేవా సంస్థలో ఉచితంగా మగ్గం, జర్దోసి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ సభ్యులు శనివారం తెలిపారు. బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో శిక్షణ జరుగుతుందన్నారు. 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్‌తోపాటు 19నుంచి 35సంవత్సరాలలోపు మహిళలకు మాత్రమే శిక్షణ ఉంటుందని, ఆసక్తిగల వారు ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 40 మందికి 40 రోజుల పాటు శిక్షణ అందజేస్తామన్నారు. వివరాలకు 99129 48080, 9247163799 నెంబర్లను సంప్రదించాలని సభ్యులు కోరారు.

కొనసాగిన పట్టురైతుల సమ్మె

● మద్దతు పలికిన గుండుమల



ర్యాలీలో పాల్గొన్న గుండుమల రైతులు, రీలర్లు

హిందూపురం అర్బన్, జనవరి 20: పట్టణ పరిధిలోని పట్టుగూళ్ళ మార్కెట్ ఎదురుగా పట్టు రైతులు చేపట్టిన సమ్మె శనివారం 4వ రోజుకు చేరింది. నాలుగున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహక ధనం అందించాలని వారు సమ్మెచేట్టిన సంగతి తెలిసిందే. సమ్మెకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ... కొన్నేళ్లుగా ఇక్కడి వాతావరణ పరిస్థితుల కారణంగా పంటలు సరిగా పండడం లేదని, ఒకవేళ పండినా గిట్టుబాటు ధరలు లభించక రైతులు విలవిలలాడుతున్నారన్నారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం అందకపోతే రైతులు జీవనం ఎలా సాగించాలని ప్రశ్నించారు. చంద్రబాబు సీఎంగా ఉన్నపుడు రైతులను ఎంతగానో ఆదుకున్నారని, నారా లోకేశ్ పాదయాత్రలో రైతుల బాధలను దగ్గరగా చూశారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ప్రోత్సాహక ధనం అందజేస్తామన్నారు. అధునాతన సదుపాయాలతో పురంలో పట్టుగూళ్ల మార్కెట్‌ను నిర్మిస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ మాట్లాడుతూ... జగన్ ప్రభుత్వం రైతుల సమస్యల పట్ల పూర్తిగా అశ్రద్ధ వహిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలన్నారు. అనంతరం రైతులు, రీలర్లు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ స్వర్ణలతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి బేవనహళ్ళి ఆనంద్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జడ్పీ శ్రీనివాసులు, సాంబశివ, పట్టు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధనాపురం వెంకటరామిరెడ్డి, జిల్లా కార్యదర్శి సిద్దారెడ్డి, సోమశేఖర్, రాజేష్, హనుమంతరెడ్డి, నవీన్, జయరామిరెడ్డి, ఓపీడీఆర్ శ్రీనివాసులు, గంగిరెడ్డి, రీలర్లు ముస్తఫా, అన్సర్, ఖలీల్ పాల్గొన్నారు.

'నవోదయ'కు 4871 మంది విద్యార్థులు హాజరు



అనంతపురం విద్య, జనవరి 20: నవోదయ విద్యాలయ పరీక్షలకు 4,871 మంది విద్యార్థులు హాజరయ్యారు. శనివారం అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 34 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ పరీక్షలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8,857 మంది విద్యార్థులు హాజరుకావాల్సిఉండగా 4,871 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఏసీ గోవింద్ నాయక్, డిప్యూటీ డీఈఓ శ్రీనివాస్‌రావు తనిఖీ చేశారు.

బంగారు గనులు తెరిపించండి

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి వినతి

రాప్తాడు, జనవరి 20: బంగారు గనులు తెరిపించి, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని ఆ పార్టీ నాయకులు కోరారు. శనివారం ఉరవకొండలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు బెంగళూరు నుంచి అనంతపురం వెళ్తుండగా రాప్తాడులో పురందేశ్వరిని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గొంది అశోక్, రామగిరి బంగారు గనుల వర్కర్స్ యూనియన్ సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లా రామగిరిలో 1984లో బంగారు గనులు ఏర్పాటు చేసి 300 మంది కార్మికులతో ఉత్పత్తి ప్రారంభించారు. 100 ఏళ్ల నడిచిన కోలార్ గోల్డ్ ఫీల్డ్ బడ్జెట్‌లో రామగిరి కలిపి మొత్తం బీజీయంఎల్‌ని ఏర్పాటు చేశారన్నారు. 1995 సంవత్సరం ఖాయిలా పరిశ్రమగా 2001వ సంవత్సరంలో బీజీఎంఎల్‌ని మూసి వేసి రెట్రెంచ్‌మెంట్ పేరుతో కార్మికులను భయపెట్టి 10 ఏళ్ల సర్వీస్ ఉండగానే ఉద్యోగాల నుంచి తొలగించి కార్మికులను వీధిపాలు చేశారన్నారు. కోర్టు తీర్పులను లెక్కచేయకుండా కర్ణాటక హై కోర్టులో టెండర్ దారులు స్క్రాప్ కటింగ్ పర్మిషన్ తెచ్చుకున్నారని, కార్మికులకు బకాయిలు చెల్లించిన తరువాతే స్క్రాప్ కటింగ్ చేయాలని కోరారు. సుప్రీం కోర్టు ఆదేశించినా న్యాయం చేయలేదని వారు వాపోయారు. సమస్యను ప్రధాని మోది దృష్టికి తీసుకెళ్లి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. నియోజకవర్గ కోకన్వీనర్ కాటమయ్య, వర్కర్స్ ఎంఎస్ శాస్త్ర, నారాయణ, సబ్‌జాన్, తిరుపాలప్ప తదితరులు పాల్గొన్నారు.

మీ వైద్యం సూపర్



● సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో అధునాతన సర్జరీలు ● పేదల ప్రాణాలు కాపాడుతున్న ప్రభుత్వ వైద్యులు

అనంతపురం టౌన్ జనవరి 20 : నగరంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యులు అధునాతన శస్త్ర చికిత్సలు నిర్వహిస్తూ పేదల ప్రాణాలు కాపాడుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో సాధ్యం కాని చికిత్సలను సైతం అందిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. తాజాగా ముగ్గురు న్యూరో సర్జరీ విభాగం వైద్యులు కార్పోరేట్‌స్థాయి ఆపరేషన్లు చేపట్టి విజయవంతం కావడంతో బాధితులు ఆరోగ్యంగా కోలుకున్నారు. శనివారం ఈముగ్గురినీ డిశ్చార్జ్ చేశారు. వైద్యుల బృందాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావులు అభినందించారు. బాధితుల వివరాలను డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, న్యూరో సర్జరీ విభాగం వైద్యులు భాస్కర్, భాస్కర్‌బాబు, రవితేజ వెల్లడించారు.



బాధితులతో సూపర్‌స్పెషాలిటీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, వైద్యులు భాస్కర్, భాస్కర్‌బాబు, రవితేజ

● నల్లచెరువు మండలానికి చెందిన 75సంవత్సరాల వెంకటరమణ తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. మాట్లాడలేని పరిస్థితికి వెళ్లడంతో కుటుంబసభ్యులు ఈనెల 9వతేదీన అనంతపురంలోని ఓప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స అసాధ్యమని చెప్పడంతో జిల్లా సర్వజన ఆస్పత్రికి తీసికెళ్లగా వైద్యులు రవితేజ పరిశీలించారు. తలకు గాయం కావడంతో రక్తం గడ్డకట్టిందని వెంటనే ఆపరేషన్ చేయాలన్నారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించి అర్ధరాత్రి సమయంలోనే ఆపరేషన్ చేశారు. పరిపూర్ణంగా కోలుకోవడంతో శనివారం డిశ్చార్జ్ చేశారు. ఇదే ఆపరేషన్ బయట చేయాలంటే రూ.4లక్షలు ఖర్చు అవుతుందని ఇక్కడ ఉచితంగా చేయడం జరిగిందని న్యూరో సర్జరీ హెచ్ఓడీ డాక్టర్ బాస్కర్ తెలిపారు. ఆపరేషన్ విజయవంతంపై కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

● కళ్యాణదుర్గం మండలం మోరేపల్లికి చెందిన 60సంవత్సరాల మారెక్క అనే వృద్ధురాలికి వెన్నెముక విరిగింది. విపరీతమైన నొప్పి రావడంతో ఈనెల 10న ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ ఎలాంటి ఆపరేషన్ లేకుండా అధునాతనమైన క్రైపో ప్లాస్టర్ సర్జరీ చేసారు. ఇలాంటి ఆపరేషన్లు పెద్దపెద్ద కార్పోరేట్ ఆస్పత్రులలోనే చేస్తారని అనంతపురంలో ఎవరూ చేయరని న్యూరో వైద్యులు బాస్కర్ వెల్లడించారు. ఆరోగ్యంగా కోలుకోవడంతో డిశ్చార్జ్ చేసారు. చికిత్స ఫలించడంపై కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

● రాప్తాడు మండలం బుక్కచెర్లకు చెందిన 74ఏళ్ల సూర్యాచారి 9నెలల క్రితం ప్రమాదంలో గాయపడ్డారు. మెదడులో రక్తం గడ్డకట్టగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. తిరిగి సమస్య రావడంతో ఈనెల 9వతేదీన సూపర్ స్పెషాలిటీలో క్రేనియో ప్లాస్టిక్ సర్జరీ చేశారు. ఇదే ఆపరేషన్‌కు ప్రైవేట్‌గా అయితే రూ.3 లక్షలనుంచి రూ.4 లక్షల వరకు అవుతుందని, ఉచితంగా చికిత్స అందిందని కుటుంబ సభ్యులు వెల్లడించారు.

అందరి సహకారంతో యూనివర్సిటీని అభివృద్ధి చేస్తా

● బాధ్యతలు స్వీకరించిన జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు

అనంతపురం సెంట్రల్, జనవరి 20: ఉద్యోగులు, సిబ్బంది ఇలా అందరి సహకారంతో వర్సిటిని అభివృద్ధి పథంలో నడిపించేలా ముందుకెళ్తానని జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం రిజిస్ట్రార్ శశిధర్ ఆధ్వర్యంలో వీసీగా శ్రీనివాస రావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంత ప్రజలకు సాంకేతిక విద్యనందిస్తున్న జేఎన్‌టీయూకి వీసీగా రావడం ఆనందంగావుందన్నారు. అనంతరం రెక్టార్ విజయ కుమార్, పలువురు డైరెక్టర్లు, విభాగాధిపతులు, ప్రొఫెసర్‌లు, ఉద్యోగులు, సిబ్బంది శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.



జేఎన్‌టీయూ వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

విభాగాల వారీగా సమీక్ష...

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వీసీ శ్రీనివాసరావు పరిపాలన భవనంలోని అన్ని విభాగాలను కలియదిరిగి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విభాగాల వారీగా సమీక్ష నిర్వహించారు. న్యాక్ ర్యాంకింగ్ సాధించేలా కృషిచేయాలని అధికారులకు వీసీ సూచించారు.

సూర్యప్రసాద్‌కు ప్రధాని బాల పురస్కార్



కిలిమంజారోపై జాతీయ జెండాతో సూర్యప్రసాద్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 20: జిల్లా కేంద్రానికి చెందిన రాగే సూర్యప్రసాద్‌కు ప్రధానమంత్రి బాల పురస్కార్ అవార్డు దక్కింది. 9 ఏళ్ల వయసు కలిగిన రాగే సూర్యప్రసాద్ టాంజానియా దేశంలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించినందుకు ఈ అవార్డుకు ఎంపిక చేశారు. అనంత పురంలోని అశోక్‌నగర్‌కు చెందిన రాగే శివప్రసాద్, ప్రమీల దంపతుల కుమారుడైన సూర్యప్రసాద్ కొడిగెనహళ్లి గురుకుల పాఠశాలలో ప్రస్తుతం 5వతరగతి చదువుతున్నాడు. ఓవైపు తైక్వాండో క్రీడలో రాణిస్తూనే మరోవైపు పర్వతారోహణలో శిక్షణ పొందుతున్నాడు. ఈనెల 22న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డును రాగే సూర్యప్రసాద్ అందుకోనున్నారు. ఈనెల 23న ప్రధాని మోదీతో నిర్వహించే ముఖాముఖిలో పాల్గొననున్నాడు.

తైక్వాండోలో కూడా ఈ బాలుడు జిల్లా, రాష్ట్ర స్థాయిలో సుమారు పదికి పైగా పతకాలు సాధించాడు. 2021లో జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పతకం సాధించాడు.

పలు చోట్ల శిక్షణ, సాధన: పర్వతారోహరణపై ప్రత్యేక శ్రద్ధ పెంచుకున్న సూర్యప్రసాద్ అనేక ప్రాంతాల్లో శిక్షణ పొందుతూ సాధన చేశాడు. నెల్లూరు, కడప జిల్లాల్లో శిక్షణ పొందిన సూర్యప్రసాద్ జమ్మూకాశ్మీర్‌లో లడక్‌లో ట్రైనింగ్ తీసుకున్నాడు. భవిష్యత్తులో ఎవరెస్ట్‌తో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పలు పర్వతాలను అధిరోహించి రికార్డు సృష్టించాలన్నదే తన లక్ష్యమని సూర్యప్రసాద్ తెలిపాడు.

జనసేన ఎన్నికల నిర్వహణ కమిటీ నియామకం

● రాయలసీమ జోన్-2 కన్వీనర్‌గా భవానీ రవికుమార్

అనంతపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికలకు జనసేన సమాయత్తమవుతోంది. ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ హాజరయ్యే సభలు, కార్యక్రమాల నిర్వహణ సజావుగా సాగేందుకుగానూ ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. అందులో భా గంగా రాయలసీమ జిల్లాలను రెండు జోన్‌లుగా విభజించారు. రాయలసీమ జోన్-2గా ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాలుగా ఏర్పాటు చేశారు. జోన్-2 కన్వీనర్‌గా జిల్లాకు చెందిన ఆ పార్టీ కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భవానీ రవికుమార్‌ను నియమించారు. ఆ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి శనివారం అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. కో-కన్వీనర్లుగా గల్లా హర్ష, సాకే పవన్‌లు, కమిటీ సభ్యులుగా గౌని ప్రసాద్, వారణాసి నవీన్‌కుమార్, సతీష్‌కుమార్, శంకర్, సాయిసంపత్, సందీప్, మద్దిలేటి, మాబు హుస్సేన్, షబ్బీర్, బోయ గోవిందు, లక్ష్మణ్, లింగారెడ్డి, వెంకటేష్‌లను నియమించారు. అదే విధంగా ఆర్ శ్రీహరి, శ్రీనివాసులును లీగల్ టీంగా ఏర్పాటు చేశారు. డా. జగన్మోహన్, డా. అరవింద్, డా. సంతోష్‌నాయక్, డా. మనోజ్, డా. కృష్ణ చైతన్య, డా. సాయి అనుదీప్‌లను డాక్టర్స్ బృందంలో చోటు కల్పించారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో వీరితో సన్నాహక సమావేశాన్ని ఆ పార్టీ ముఖ్యులు నిర్వహించనున్నారు.



కిసాన్‌మేళాను వినియోగించుకోండి

● ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ రామసుబ్బయ్య

పుట్టపర్తిరూరల్, జనవరి 20: ప్రతికూల వాతావరణంలో అనువైన పంటలను సాగుచేయడానికి మెలకువలు తెలియజేసేందుకు గాను నిర్వహించే జోనల్‌స్థాయి కిసాన్‌మేళాను ఉమ్మడి జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలని పట్టణంలోని ఏరువాకకేంద్రం కోఆర్డినేటర్ రామసుబ్బయ్య సూచించారు. ఏరువాక కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 23వ తేదీన అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట వ్యవసాయపరిశోధనా కేంద్రంలో జోనల్‌స్థాయి కిసాన్‌మేళా జరగనుందన్నారు. ఇందులో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొని ప్రతికూల వాతావరణంలో అనువైన పంటలను సాగు చేయడానికి అవసరమైన మెలకువలను తెలియజేస్తామన్నారు. అంతేకాకుండా వ్యవసాయంలో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన రోబోట్స్, డ్రోన్స్, వ్యవసాయ యంత్రీకరణ, విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు, టిష్యూకల్చర్, మొక్కలు, జీవన ఎరువులకు సంబంధించిన స్టాల్స్‌ను ఆయా కంపెనీలు ప్రదర్శిస్తాయని చెప్పారు. భారతీయ నూనెగింజల పరిశోధన సంస్థ హైదరాబాద్, అనంతపురం, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లాల ఏరువాక కేంద్రాలు, కృషివిజ్ఞాన కేంద్రాలు, వ్యవసాయ పరిశోధనా స్థానంల శాస్త్రవేత్తలు వివిధ శాఖల అధికారులు పాల్గొనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని ఉమ్మడిజిల్లా రైతుల సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆటో బోల్తా: ఐదుగురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజు

గుత్తిరూరల్, జనవరి 20: పట్టణ శివారులోని స్పందన ఫంక్షన్ హాల్ వద్ద 67వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. గుత్తికి చెందిన ఆదినారాయణ, రాజు, వరలక్ష్మి, నాగరాజు, విజయరామరాజు, విమలమ్మలు వన్నేదొడ్డిలో వారి బంధువుల ఇంటిలో 11 రోజుల దినకార్యము వెళ్లారు. అనంతరం తిరిగి వస్తుండగా గుత్తి పట్టణ శివారులో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం రాజుని అనంతపురానికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



చికిత్స పొందుతున్న వరలక్ష్మి

సీఎం పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

● జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ఉరవకొండ,జనవరి20: సీఎం జగన్ ఉరవకొండ పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సీఎం పర్యటనలో భాగంగా అనంతపురం రోడ్డులోని సభాస్థలి, హెలీప్యాడ్ ఏర్పాటు కోసం డిగ్రీ, జూనియర్ కళాశాల మైదానాలను జిల్లా కలెక్టర్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం పట్టణంలో ని తొగటవీర కల్యాణ మండపంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న ముఖ్యమంత్రి ఉరవకొండలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, జడ్పీసీఈఓ నిదియాదేవి, అడిషనల్ ఎస్పీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి, డీఆర్‌డీఏ నరసింహరెడ్డి, మెప్మా పీడీ విజయ్‌లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి

పోలీస్ సమస్యలపై ఎస్పీ జూమ్ కాన్ఫరెన్స్

అనంతపురం క్రైం, జనవరి 20: జిల్లా ఎస్పీ అన్బురాజన్ పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారంపై దృష్టి సారించారు. శనివారం జిల్లాలోని సివిల్, ఏఆర్ పోలీస్ సిబ్బంది సమస్యలపై ఎస్పీ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. విధుల్లో, వ్యక్తిగతంగా సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలపై ఆరా తీశారు. వివిధ రకాల సమస్యలను ఎస్పీ దృష్టికి తెచ్చారు. ఎస్పీ స్పందించి సిబ్బంది విన్నపాలు, విజ్ఞప్తులను నిబంధనలను అనుసరించి పరిష్కరిస్తామని తెలిపారు. కొన్ని సమస్యలకు అప్పటికప్పుడు పరిష్కరించారు.

ఎంపీ, రెండు ఎమ్మెల్యే స్థానాలు కేటాయించండి

శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్‌కు మైనార్టీ సంఘాల వినతి



షరీఫ్‌కు వినతి పత్రం అందజేస్తున్న మైనార్టీ సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్, జనవరి 20: ఉమ్మడి జిల్లాలో టీడీపీ తరపున రాబోవు ఎన్నికల్లో ముస్లింలకు ఒక ఎంపీ, రెండు ఎమ్మెల్యే స్థానాలు కేటాయించేలా చూడాలని శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్‌కు మైనార్టీ సంఘాల నాయకులు విన్నవించారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో ఆయనకు వినతిపత్రం అందజేశారు. మైనార్టీ నాయకులంతా ఏకతాటిపై ఉండి అభ్యర్థిని గెలిపించుకుంటామన్నారు. షరీఫ్ స్పందిస్తూ చంద్రబాబు దృష్టికి మీ వినతిని తీసుకువెళతామని హామీ ఇచ్చారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు.

23 నుంచి అనంత లఘుచిత్ర వారోత్సవాలు

అనంతపురం ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు రషీద్‌బాషా

అనంతపురం కల్చరల్, జనవరి 20: నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 23 నుంచి 6వ అనంత లఘుచిత్ర వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఫిల్మ్‌సొసైటీ అధ్యక్షుడు రషీద్‌బాషా తెలిపారు. శనివారం ఆర్ట్స్‌కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 23న ఉత్సవాల ప్రారంభ కార్యక్రమం, 26, 27వ తేదీల్లో విద్యుత్ కళావేదికలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఔత్సాహికులు రూపొందించిన లఘుచిత్రాల ప్రదర్శన, మొబైల్ ఫిల్మ్ మేకింగ్ లఘుచిత్రాల ప్రదర్శన ఉంటుందన్నారు. 28వ తేదీన ఉత్తమ లఘుచిత్రాలకు ప్రముఖుల చేతులమీదుగా అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు సుధాకర్, పద్మావతి, అనంతపురం ఫిల్మ్ సొసైటీ సభ్యులు తోట బాలన్న, మురళీధర్‌రావు, హొన్నూరప్ప, యాంకర్ రమేష్ నీల్, వెంకటేష్‌నాయక్ పాల్గొన్నారు.

త్రోబాల్ జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్/రాప్తాడు, జనవరి 20: త్రోబాల్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సీనియర్ జట్ల ఎంపిక జరిగింది. రాప్తాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఎంపిక పోటీలు జరిగినట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి బొగ్గు రవి తెలిపారు. పురుషుల జట్టుకు సంబంధించి రాజు, సృజన్, సిద్ధార్థ, వినోద్‌కుమార్, చిన్న, వంశీ, గణేష్, మహేష్, ఉమాశంకర్, నిఖిల్ కుమార్, నరసింహా, తన్మయ్, టి నరసింహనాయక్ ఎంపికయ్యారు. మహిళల జట్టులో నవ్య, భవిత, ఉమామహేశ్వరి, అంజలిప్రియ, కీర్తన, నాగసంహిత, హేమలత, సీ ఇందు, అనూషా, టీ ఇందు, పల్లవి, ఎంకే పవిత్ర, హేమశ్రీ, కేకే పవిత్ర, వర్షిత ఎంపికయ్యారు. ఎంపికైన జట్లు ఈనెల 27వతేదీ నుంచి శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లిలో నిర్వహించే రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో త్రోబాల్ అసోసియేషన్ సభ్యులు పీడీలు కేశవమూర్తి, ప్రభాకర్, రాజారెడ్డి, అశోక్‌రాజ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురంరూరల్, జనవరి 20: విద్యుత్‌లైన్ల మరమ్మతుల్లో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ టౌన్-1 డీఈఈ నాగేంద్ర తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు హౌసింగ్‌బోర్డు, నవోదయకాలనీ, బెంగుళూరు రోడ్డు, హమాలీ కాలనీ, భైరవనగర్, శారదనగర్, బుడ్డప్పనగర్, ఎస్‌బిఐ కాలనీ, ఆర్‌కే కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ

రామగిరి, జనవరి 20: మండలంలోని దుబ్బార్లపల్లి గ్రామంలో అయోధ్య రామయ్య అక్షింతలను శనివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. అక్షింతలను గ్రామపెద్దలు, భజన బృందం ఊరేగింపుగా వెళ్లి పంపిణీ చేసి సోమవారం రాముల వారి అక్షింతలను భక్తిశ్రద్ధలతో తలపై వేసుకోవాలని సూచించారు.

పంపు సెట్లకు మీటర్లు వద్దు: సీపీఐ

గార్లదిన్నె, జనవరి 20: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు అమర్చడం విరమించుకొని ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గార్లదిన్నె మండల సమితి ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని బోరుబావులు, పంపుసెట్లకు మీటర్లు అమర్చాలనే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. కూరగాయలు, పండ్లతోటలు, ఉద్యాన పంటలు సాగు చేసి జీవనం కొనసాగిస్తున్న రైతులు ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్ కో ఏఈ లేకపోవడంతో ఆయన కుర్చీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టీ నారాయణస్వామి, మండల సహాయ కార్యదర్శి వన్నూరుస్వామి, రైతు సంఘం నాయకులు డ్యాం కిష్ట, మహిళా సంఘం నాయకులు అంజినమ్మ, శివయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి: టీఎన్ఎస్ఎఫ్



వినతిపత్రం ఇస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం సెంట్రల్, జనవరి 20: జేఎన్‌టీయూ పరిధిలోని విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు లక్ష్మీనరసింహ వీసీ శ్రీనివాసరావును కోరారు. శనివారం టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వీసీకి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, శివకుమార్, టీడీపీ నాయకులు ఏకాంబర, నాగేంద్ర, బంటి పాల్గొన్నారు.

అక్రమ నియామకాలను రద్దుచేయాలి: ఏఐఎస్ఎఫ్


ఎస్కేయూ అధికారులు అక్రమంగా నియామకాలు చేపట్టారని, వాటిని రద్దుచేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్‌చేశారు. శనివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వీసీ హుస్సేన్‌రెడ్డికి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అంకన్న, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయిస్వామి, నాయకులు వంశీ, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యువ పురస్కార గ్రహీతకు ఘనస్వాగతం

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 20: జాతీయ యువపురస్కారం అందుకున్న బిసాటి భరత్‌కు ఘనస్వాగతం లభించింది. నాసిక్‌లో నిర్వహించిన 27వ జాతీయ యువజనోత్సవాలలో కేంద్ర యువజన క్రీడాశాఖ మంత్రి నిషిత్ ప్రమాణిక్ చేతుల మీదుగా జిల్లాకు చెందిన బిసాటి భరత్ జాతీయ యువపురస్కారాన్ని అందుకున్నారు. శనివారం నగరానికి చేరుకున్న ఆయనకు స్థానిక రైల్వేస్టేషన్‌లో ఘనస్వాగతం లభించింది. రైల్వేస్టేషన్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా ఆర్ట్స్ కళాశాల వరకు ఊరేగింపుగా వచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ రమేష్ సుంకర, నెహ్రూ యువ కేంద్రం ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివాసులు, అచార్యులు ప్రణతి, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు జీవన్‌కుమార్, జయమారుతి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ల కోసం రోగులకు తప్పని ఎదురుచూపులు

శింగనమల, జనవరి 20: పేరుకు మాత్రం 24 గంటల కమ్యూనిటీహెల్త్ సెంటర్. ఆరుగురు డాక్టర్లు ఉన్నారు. అయితే రోగులు మాత్రం వారి రాకకోసం వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. శనివారం నియోజకవర్గ కేంద్రం శింగనమల కమ్యూనిటీహెల్త్ సెంటర్‌లో ఉదయం 10 గంటలు అయినా ఒక డాక్టర్ కూడా రాలేదు. రోగులు డాక్టర్ల కోసం నిరీక్షించారు. ఉదయం 9 గంటలకు డాక్టర్లు రావాల్సి వుండగా 10.30 గంటలకు ఒక మహిళా డాక్టర్ మాత్రమే వచ్చి రోగులకు చికిత్స అందించారు. పేరుకే 24 గంటల హెల్త్ సెంటర్లని, సమయానికి ఎవరూ రావడంలేదని, ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని రోగులు కోరుతున్నారు.





ఉదయం 10.30 గంటల సమయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు, వేచిచూస్తున్న రోగులు

ఎన్నికలు సమీపిస్తుండటంతో హడావుడి చేస్తున్నారు

ఐదేళ్లు నిద్రపోయి.. ఇప్పుడు లేచావా..?

ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిపై మాజీమంత్రి పరిటాల సునీత ధ్వజం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత

అనంతపురం రూరల్, జనవరి 20: ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో తాగునీటి పేరిట ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి హడావిడి చేస్తున్నారని మాజీ మంత్రి పరిటాల సునీత విమర్శించారు. శనివారం మండలంలోని పాపంపేట పంచాయతీ ఆంజనేయనగర్, ఉమానగర్, లలితనగర్, సౌభాగ్యనగర్, శాంతినగర్, ఓంనగర్ ప్రాంతాల్లో బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ చేపట్టి స్థానికులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి పరిటాల సునీత, జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ ఉమెన్ కోఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత, మాజీ జడ్పీటీసీలు వేణుగోపాల్, రామ్మూర్తినాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా కాలనీవాసులు స్థానిక సమస్యలను పరిష్కరించాలని మాజీమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పరిటాల సునీత మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేసి వేయించాలని కోరారు. ఇదే సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఐదేళ్లపాటు అధికార మత్తులో నిద్రపోయి ఇప్పుడే లేచినట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. తాగునీటి పైపులైన్ వేస్తున్నామని హడావిడి చేస్తున్నారన్నారు. ఈ చిత్త శుద్ధి ఐదేళ్లపాటు చూపించి ఉంటే ప్రజలు ఇన్ని రోజులు ఫ్లోరైడ్ నీటితో ఇబ్బందులు పడేవారు కాదుకదా అని ప్రశ్నించారు. ఓట్ల కోసం ఇప్పుడు తాగునీటి డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పాముదాయి రఘు, మాజీ ఎంపీపీ మాధవి, మాజీ మండల కన్వీనర్ జయకృష్ణ, నాయకులు రామాంజినేయులు, లింగయ్యయాదవ్, శ్రీరాములు, బాబావలి, వెంకటస్వామి, కురుగుంట నారాయణస్వామి, మనోహర్‌నాయుడు, గంగాధర్‌రెడ్డి, బిల్లా నాగరాజు, అల్లీపీరా, రాజగోపాల్, గ్రామ కమిటీ అధ్యక్షులు జెట్టి భరత్, తెలుగుయువత రాష్ట్ర అధికారప్రతినిధి హరీష్‌రెడ్డి, రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షుడు మద్దినేనికృష్ణ, తెలుగు మహిళలు లక్ష్మీదేవి, రామసుబ్బమ్మ, సాలమ్మ, మంజుల, స్వప్న, రామాంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో టీడీపీ జెండా ఎగరాలి

శింగనమల నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు గుర్రప్పనాయుడు



గుర్రప్పనాయుడుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ద్విసభ్యకమిటీ సభ్యులు

బుక్కరాయసముద్రం, జనవరి 20: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ జెండా ఎగరాలని నియోజకవర్గ పార్టీ పరిశీలకులు గుర్రప్పనాయుడు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. శనివారం అనంతపురంలోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ ముఖ్య నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, మండల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ టూమెన్ కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటి, జయహో బీసీ, ఓటరు జాబితా పరిశీలన, పార్టీ కార్యక్రమాల నిర్వహణపై ఆ పార్టీ పరిశీలకుడు గుర్రప్పనాయుడు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అభ్యర్థి ఎవరైనా విజయమే లక్ష్యమన్నారు. అభ్యర్థి ఎంపిక విషయాన్ని పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చూసుకుంటారన్నారు. ఇదే సందర్భంలో కొందరు నాయకులు అభ్యర్థి ఎంపిక విషయంపై పలు సూచనలు చేయడంతో వాటిని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అభ్యర్థి ఎంపిక విషయంలో ఆయన అభిప్రాయాలు తీసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, మాజీ జడ్పీటీసీ రామలింగారెడ్డి, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి, మండల కన్వీనర్లు అశోక్, పాండు, ఎర్రినాగప్ప, జిల్లా కార్యదర్శి సుదర్శన్‌నాయుడు, నాయకులు వాసాపురం బాబు, బాలరంగయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలకు చిరునామా మన జిల్లా

చిరుధాన్యాల పండుగ ప్రారంభోత్సవంలో వక్తలు



చిరుధాన్యాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న మాంచో ఫెర్రర్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 20: చిరుధాన్యాలకు చిరునామాగా జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంత చిరుధాన్యాల పండుగ-2024 ప్రదర్శన ప్రారంభించారు. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్ మాట్లాడుతూ ఫాస్ట్‌ఫుడ్ కల్చర్ పెరగడంతో చిరుధాన్యాల వినియోగం తగ్గిందన్నారు. భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన సమాజం అందించాలంటే ప్రతి ఒక్కరూ తమ ఆహారపు అలవాట్లను మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతివనం వ్యవస్థాపకుడు ప్రసాద్ మాట్లాడుతూ ప్రతినిత్యం వ్యాయామం, నడక చేసినా జబ్బులు వస్తున్నాయంటే దానికి కలుషిత ఆహారం తీసుకోవడమేనన్నారు. ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి మాట్లాడుతూ చిరుధాన్య పంటల విశిష్టతను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వసీం, సీనియర్ జర్నలిస్టు పతంగి రాంబాబు, సీసీడీ డైరెక్టర్లు తిరిచర్ల శాస్త్రి, ఏఆర్ఎస్‌కే ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త సహదేవరెడ్డి, ఏఎఫ్ ఎకాలజీప్రతినిధి మురళీకృష్ణ, జనజాగృతి ప్రతినిధి బలరాం, రెడ్స్ సంస్థ ప్రతినిధి భానుజా, విజయభాస్కర్, నరసింహారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం వెంటనే చెల్లించాలి

ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం కల్చరల్, జనవరి 20: జిల్లాలో 2023 ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఏపీ రైతుసంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేయగా వర్షాలు రాక వేరుశనగ, కంది, పత్తి, ఆముదం, జొన్న, మొక్కజొన్న, కొర్ర, సజ్జ, ఉలవలు, పొద్దుతిరుగుడు తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. కనీసం పెట్టిన పెట్టుబడి సైతం రాకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుసంఘాలు పోరాటం చేస్తే ప్రభుత్వం జిల్లాలో ఉన్న 31 మండలాలకుగాను 28 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించిందన్నారు. సంక్రాంతిలోపు రైతుల ఖాతాల్లో పంటనష్ట పరిహారం జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంతవరకూ జమ చేయలేదన్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి చేయకపోవడం దౌర్భాగ్యకరమన్నారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలోనైనా రైతుల ఖాతాల్లో పంట నష్ట పరిహారం జమచేసి, జిల్లాలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కరువు మండలాలుగా ప్రకటించని యల్లనూరు, బొమ్మనహాల్, బెళుగుప్ప మండలాలనూ కరువు మండలాలుగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, నాయకులు శివారెడ్డి, పోతులయ్య పాల్గొన్నారు.

కులగణన ప్రణాళికాబద్ధంగా నిర్వహించండి

కమిషనర్ మేఘస్వరూప్

అనంతపురం క్రైం, జనవరి 20: కులగణన కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని నగర కమిషనర్ మేఘస్వరూప్ సూచించారు. శనివారం నగరపాలిక పరిధిలోని కోవూర్‌నగర్, అరవిందనగర్‌లోని సచివాలయాలను కమిషనర్ తనిఖీ చేశారు. సచివాలయాల్లోని పలు రికార్డులను పరిశీలించారు. సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి అర్హులైన వారిని లబ్దిదారులుగా చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణకు తరలిరావాలి

అనంతపురం న్యూటౌన్, జనవరి 20: ఏపీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల విజయవాడలో బాధ్యతలు తీసుకుంటున్న నేపథ్యంలో కార్యక్రమానికి తరలిరావాలని ఏపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు దాదాగాంధీ పిలుపునిచ్చారు. శనివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయ సాధన షర్మిలతో సాధ్యమన్నారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు.

పశువుల సంతను పరిశీలించిన కార్యదర్శి



సంతలో రుసుం వసూలును పరిశీలిస్తున్న యార్డు కార్యదర్శి జయలక్ష్మి

అనంతపురం రూరల్, జనవరి 20: వ్యవసాయ మార్కెట్‌లోని సంతను మార్కెట్ యార్డు ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి పరిశీలించారు. శనివారం గొర్రెలు, మేకల సంత నిర్వహణ జరిగింది. ఈ సందర్భంగా సుంకం వసూలును ఆమె పరిశీలించారు. రైతులకు, వ్యాపారులకు తప్పని సరిగా రసీదు ఇవ్వాలన్నారు. మార్కెట్‌కు వచ్చే రైతులు, వ్యాపారులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కేశవకుమార్, నాగేంద్ర, కృపావతి తదితరులు పాల్గొన్నారు.

ధర్మమార్గంలో నడిపేందుకే వేంకటేశ్వర అవతారం

ప్రవచనకర్త అన్నాజీ



అనంతపురం కల్చరల్, జనవరి 20: మానవాళిని ధర్మమార్గంలో నడిపించేందుకే శ్రీమహావిష్ణువు కలియుగంలో వేంకటేశ్వర అవతారం ఎత్తారని ప్రవచనకర్త అన్నాజీ పేర్కొన్నారు. సాయి ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో ఆర్ఎఫ్‌రోడ్డు లక్ష్మీ వెంకటేశ్వర దేవాలయంలో శనివారం సాయంత్రం వెంకటేశ్వరస్వామి వైభవ సప్తాహం ప్రారంభమైంది. పుట్టపర్తికి చెందిన ఆధ్యాత్మిక ప్రవచనకర్త అన్నాజీ ప్రవచనాలు చేశారు. కృతయుగంలో నారసింహునిగా, త్రేతాయుగంలో శ్రీరాముడుగా, ద్వాపరయుగంలో వాసుదేవుడిగా అవతరించిన ఆ దేవదేవుడు కలియుగంలో వేంకటేశ్వరుడిగా అవతరించారన్నారు. శేషాద్రి, నీలాద్రి, గరుడాద్రి, అంజనాద్రి, వృషభాద్రి, నారాయణాద్రి, వెంకటాద్రిగా సప్తగిరులపై శ్రీనివాసులు మానవాళి కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంలంగా వెలిసారన్నారు. కార్యక్రమంలో విశ్రాంత తహసీల్దార్ పాలసముద్రం నాగరాజు, సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ , విష్ణుసహస్రనామ సత్సంగ సభ్యులు రామ్మూర్తి, మేడా వెంకటేశ్వర్లు, సాయి ట్రస్టు సభ్యులు నారాయణ, రామాంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.

పురందేశ్వరికి ఘనస్వాగతం

అనంతపురం సెంట్రల్, జనవరి 20: ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ నిమిత్తం శనివారం జిల్లాకు వచ్చిన పురందేశ్వరికి జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, రాప్తాడు నియోజకవర్గ కన్వీనర్ చైతన్య కిషోర్ ఘనస్వాగతం పలికారు. గోనుగుంట్ల సూర్యనారాయణ ఆయన నివాసంలో ఆమెకు తేనీటి విందు ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సాకే ఓబులేసు, శివమూర్తి, ప్రకాష్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



పురందేశ్వరికి స్వాగతం పలుకుతున్న చైతన్య కిషోర్

సమావేశానికి వెళితే సమస్యలు తీరుతాయా..?

నిధులు లేవంటారు.. ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నాం

మండల సర్వసభ్య సమావేశంపై ఆసక్తిచూపని ప్రతినిధులు

రాప్తాడు, జనవరి 20: ప్రజలు అవి చేయండి.. ఇవి చేయండి అని అడుగుతున్నా నిధులు లేక వారికి ఏం సమాధానం చెప్పాలో తెలియక తల గీక్కుంటున్నాం.. ఉన్నామంటే ఉన్నామంతే... ఈ మాత్రం దానికి మండల సర్వసభ్య సమావేశానికి ఏం పోతావులే.. వెళితే సమస్యలు తీరతాయా..? నిధులు మంజూరు చేస్తారా..? అని రాప్తాడు మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించగా ఉదయం 11:30 గంటల వరకు ఐదుగురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. 11:45 గంటలకు కోరంకు సరిపడేంతమంది సభ్యులు మాత్రమే హాజరవ్వడంతో సమావేశం ప్రారంభించారు. 16 మంది సర్పంచులకు గానూ నలుగురు వైసీపీ సర్పంచులు హాజరు కాగా అందులో ఒక సర్పంచ్ సంతకం చేసి వెళ్లారు. సమావేశానికి ముగ్గురు సర్పంచులు మాత్రమే ఉన్నారు. నలుగురు ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యుడు వచ్చారు. మండలస్థాయి అధికారులు కూడా అరకొరగా హాజరయ్యారు. సమావేశాన్ని గంటకే మమ అనిపించారు. గత సమావేశాల్లో చెప్పిన సమస్యలు నెలలు గడుస్తున్నా పరిష్కరించలేదు.. ఇప్పుడు సమావేశానికి వచ్చినా సమస్యలు తీరుతాయా..? నిధులు వస్తాయా..? అంటూ టీడీపీ సర్పంచులతోపాటూ వైసీపీ సర్పంచులు కూడా ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు లేకపోవడంతోనే సర్వ సభ్య సమావేశానికి హాజరయ్యేయందుకు ప్రజాప్రతినిధులు ఆసక్తి చేపడం లేదని చెబుతున్నారు. సమావేశానికి ఎంపీడీఓ సాల్మన్‌రాజ్, ఎంపీపీ జయలక్ష్మి, జడ్పీటీసీ హేమావతి, వైస్ ఎంపీపీ వరలక్ష్మి హాజరయ్యారు.

సమ్మెను విరమించం: అంగన్‌వాడీలు

నార్పల, జనవరి 20: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారం 40వ రోజుకు చేరింది. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీదేవి, రేణుక మాట్లాడుతూ తమ డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె విరమించబోమని స్పష్టంచేశారు. సమ్మెలో ఆ యూనియన్ నాయకులు రామాంజినమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల కేంద్రంలో అంగన్‌వాడీలు శనివారం దీక్షా శిబిరం నుంచి బస్టాండ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సర్కిల్‌లో మానవహారంగా నిలిచి నిరసన తెలియజేశారు.

శింగనమల: మండల కేంద్రంలో శనివారం శింగనమల రహదారిపైన అంగన్వాడీలు 2 గంటలు రోడ్డుపై నిరసనలు చేశారు. సీపీఎం నాయకులు బాస్కర్ శ్రీనివాసులు సంఘీబావం తెలిపారు.

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో అంగన్వాడీలు నిరసన తెలిపారు. డిమాండ్లను పరిష్కరించాల్సిందేనని పట్టుపట్టారు. నిరసనలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



గార్లదిన్నెలో మానవహారంగా అంగన్‌వాడీలు

ప్రాణం ఉన్నంత వరకు పరిటాల సైనికుడిగా ఉంటా

టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురాం

అనంతపురం విద్య, జనవరి 20: ప్రాణం ఉన్నంత వరకు పరిటాల సైనికుడిగానే ఉంటానని, తనపై సోషల్ మీడియాలో రాప్తాడు ఎమ్మెల్యే తప్పుడు ప్రచారం మానుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బండిపరశురాం సూచించారు. శనివారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తాను పార్టీ మారాలని ప్రయత్నాలు చేశానంటూ తనపై సోషల్‌మీడియాలో వైసీపీ ఎమ్మెల్యే తప్పుడు ప్రచారం చేయించారన్నారు. మా అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాలు పెట్టి తన పేరుపై ఉన్న 3.23 ఎకరాలు అక్రమంగా రిజిస్టర్ చేయించుకోవడమేకాకుండా ఎలాంటి క్రిమినల్ కేసులు లేకున్నా రౌడీషీట్ ఓపెన్ చేయించాడన్నారు. అటెంప్ట్ మర్డర్ కేసుతోపాటు 16 కేసులు పెట్టించాడని వివరించారు. మూడుసార్లు జైలుకు పంపాడని పేర్కొన్నారు. ప్రస్తుతం తన భూమిని తిరిగి ఇస్తానని, రౌడీషీట్, తనపై ఉన్న కేసులు ఎత్తివేయిస్తానంటూ పార్టీలోకి రావాలని మధ్యవర్తులను పంపింది నిజం కాదా అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో పరిటాల కుటుంబం ఆధ్వర్యంలో రాప్తాడులో టీడీపీ జెండా ఎగరేస్తామని పేర్కొన్నారు.

టీడీపీలోకి పలువురు మైనార్టీల చేరిక

అనంతపురం అర్బన్, జనవరి 20: అనంతపురం అర్బన్ రెండో డివిజన్‌కు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి సమక్షంలో మైనార్టీల ఆత్మీయ సమావేశంలో వారు పార్టీలోకి చేరారు. వారికి షరీఫ్ ఫరూక్, ప్రభాకర్ చౌదరి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆస్పత్రిలో ఆర్వోప్లాంట్ ప్రారంభం

అనంతపురం టౌన్, జనవరి 20: రోగుల సౌకర్యార్థం జిల్లా సర్వజన ఆస్పత్రిలో మంచినీరందించేందుకు న్యాయవాదులు ఎస్ఎం ఆలీఅజాం, సబీరాకణం, ఎస్ గోపీ రూ. 6 లక్షలు వెచ్చించి ఆర్వోప్లాంట్ ఏర్పాటు చేశారు. శనివారం సూపరింటెండెంట్ డాక్టర్ వేంకటేశ్వరరావు ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రామస్వామి, ఆర్ఎంఓలు డాక్టర్లు పద్మజ, హేమలత, శివకుమార్ పాల్గొన్నారు.

నాగేంద్రకు గిడుగు సాహితీ పురస్కారం



అనంతపురం కల్చరల్, జనవరి 20: జిల్లాకు చెందిన డాక్టర్ నానీల నాగేంద్ర గిడుగు జాతీయ సాహితీ పురస్కారానికి ఎంపికైనట్లు గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్ నిర్వాహకుడు బిక్కికృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించే సభలో పురస్కారం అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు. కాగా నాగేంద్ర ఎంపికపట్ల కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, ఆచార్య బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ శాంతినారాయణ, యాములపల్లి నర్సిరెడ్డి, పూజారి ఈరన్న, హరీష్‌కుమార్ వేర్వేరు ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

కోల్‌కత్తా వాసి అనుమానాస్పద మృతి

అనంతపురం క్రైం, జనవరి 20: నగరంలోని హమాలీకాలనీలో కోల్‌కత్తా రాష్ట్రానికి చెందిన రోహిత్(23)అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. హౌరా జిల్లా బట్లల్ ప్రాంతానికి చెందిన రోహిత్, అతడి బావమరిది మఫీజుర్, మరో ఇద్దరు కలిసి నగరంలోని హమాలీకాలనీలోని ఓ కొత్త ఇంటిలో కార్పెంటర్లుగా పనిచేయడానికి రెండు వారాల క్రితం వచ్చారు. అదే ఇంట్లో పని చేస్తూ అక్కడే ఉంటున్నారు. శనివారం ఉదయం రోహిత్ వారుంటున్న ఇంటి సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్ ఎదుట శవమై కనిపించాడు. రాత్రి నలుగురూ కలిసే పడుకున్నారు. కొత్త ఇంటికి తలుపులు ఇంకా ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయంలో రోహిత్ ఇంటి బయట ఉన్న గేటుకు తాళం వేసి తాళాలు పక్కన పడేసి వెళ్లాడు. ఉదయం రోహిత్ మృతదేహం కనిపించడంతో టూటౌన్ పోలీసులకు సమాచారం అందింది. సీఐ శివరాముడు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనారోగ్యంతో మృతి చెందాడా..? ఎవరైనా హత్య చేశారా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రోహిత్‌తోపాటు ఉన్న మరో ముగ్గురిని అదుపులోకి విచారిస్తున్నారు.

రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య

ఆర్థికంగా నష్టం చేకూరడం, అప్పులు ఎక్కువ చేసిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి శనివారం ఆత్మహత్య చేసుకున్నట్లు టూటౌన్ సీఐ శివరాముడు తెలిపారు.నగరంలో నాలుగోరోడ్డుకు చెందిన బూదగవి పెద్దన్న(60) సుభాష్ రోడ్డులోని రాజధాని లాడ్జి యజమాని వద్ద గతంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో కమీషన్ల బిజినెస్ చేసేవాడు. ఆ యజమాని కొన్నేళ్లుగా ఆ వ్యాపారం చేయకపోవడంతో పెద్దన్న మరో వ్యక్తితో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. ఈ క్రమంలో అప్పులు చేసి, ఒత్తిళ్లు అధికమై నగరంలోని మారుతి లాడ్జ్‌లోని ఓ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఘర్షణ కేసులో ఐదుగురికి రిమాండ్

అనంతపురం క్రైం, జనవరి 20: నగరంలోని అంబేడ్కర్ నగర్‌లో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ కేసులో వన్‌టౌన్ పోలీసులు ఐదుగురిని రిమాండ్‌కు పంపారు. ఈనెల 14న అంబేడ్కర్‌నగర్‌లో ఓ యువతి, మరో యువకుడు బంధువుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఘటనలో ఇరువర్గాలకు చెందిన తొమ్మిది మందికి గాయాలు కాగా ఇరువర్గాలకు చెందిన 20మందిపై కేసు నమోదు చేశారు. శనివారం ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.

లెక్చరర్స్ కాలనీలో చైన్‌స్నాచింగ్

లెక్చరర్స్ కాలనీలో శనివారం చైన్‌స్నాచింగ్ జరిగినట్లు త్రీటౌన్ సీఐ ధరణికిషోర్ తెలిపారు. లెక్చరర్స్ కాలనీలో నివాసముంటున్న 62ఏళ్ల మైమూన్ శనివారం ఉదయం ఆ కాలనీలో వాకింగ్ చేస్తుండగా ఇద్దరు అగంతకులు బైక్‌లో వేగంగా ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధితురాలు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

టీడీపీ కార్యకర్త మృతి

గార్లదిన్నె, జనవరి 20: మండలంలోని బూదేడు గ్రామానికి చెందిన తెలుగుదేశంపార్టీ నాయకులు గుర్రం పెద్దయ్య శనివారం మరణించారు. విషయం తెలుసుకున్న శింగనమల నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బండారు శ్రావణిశ్రీ, ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్య పడవద్దని అండగా ఉంటామని మనోధైర్యం నింపారు.

20 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్, జనవరి 20: మండలంలోని లింగదహాళ్, రంగాపురం క్యాంపు గ్రామాల్లోని వైసీపీకి చెందిన 20 కుటుంబాలు శనివారం టీడీపీలోకి చేరాయి. టీడీపీ మాజీ కన్వీనర్ చలపతి, దివాకర్, రామాంజనేయులు, గోపాల్ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 20 కుటుంబాలు పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు సమక్షంలో టీడీపీ కండువా వేసుకున్నారు. రాయదుర్గం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో రామాంజనేయులు, ఓబుళేశు, మల్లప్ప, లోకేష్, ప్రసాద్, నాగేంద్ర, వీరన్న, ఫైనేటి శరత్‌బాబు, ఫైనేటీ నారాయణ టీడీపీలోకి చేరారు. జగన్ పాలనలో ఏ మాత్రం అభివృద్ధి చెందలేదని వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని అన్ని సామాజిక వర్గాల వారు అభివృద్ధి చెందుతారని వారన్నారు.

ఎమ్మెల్యే కేశవ్‌కు సన్మానం

ఉరవకొండ, జనవరి 20: ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి విచ్చేసిన పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌ను భారీ గజమాలతో సన్మానించారు. కమ్మ సేవా సంఘం, టీడీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఆయనకు ఘనస్వాగతం పలికారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మండల కన్వీనర్ విజయ్ భాస్కర్, టీడీపీ నాయకులు తిమ్మప్ప, నర్రాకేశన్న, నెట్టెం బోస్, ఎర్రగుంట్ల వెంకటేశులు, సుధాకర్ పాల్గొన్నారు.



పయ్యావుల కేశవ్‌ను గజమాలతో సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

అరటిగెలలు నరకడం పిరికిపంద చర్య

● ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం, కేశవరెడ్డి

పుట్లూరు, జనవరి 20: టీడీపీ నాయకుడికి చెందిన అరటితోటలో గెలలు నరకడం పిరికిపంద చర్య అని ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి అన్నారు. మండలంలోని కుమ్మనమల గ్రామంలో శనివారం నరికివేసిన అరటిగెలలను పరిశీలించి టీడీపీ నాయకుడు ఓబన్నను పరామర్శించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకపాలన కొన్ని నెలల్లో పోతుందన్నారు. ఇలాంటి సంస్కృతి గతంలో లేదన్నారు. చెట్లను, గెలలను నరకడం నీచమైన సంస్కృతి అన్నారు. నిందితులను వెంటనే శిక్షించాలని డిమాండ్‌చేశారు. వారివెంట సుదర్శన్‌నాయుడు, రామలింగారెడ్డి, శివశంకర్‌రెడ్డి, రామకృష్ణరెడ్డి, విజయ్, చంద్రశేఖర్‌నాయుడు, ఆదినారాయణరెడ్డి, చంద్ర ఉన్నారు.



నరికిన గెలలను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న జేసీ అశ్మిత్‌రెడ్డి



క్రైస్తవుల ప్రార్థనల్లో పాల్గొన్న జేసీ అశ్మిత్ రెడ్డి

పెద్దపప్పూరు, జనవరి 20: మండలంలోని జూటూరు గ్రామంలో ఉన్న ప్రేమమందిరం 10వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఏర్పాటుచేసిన ప్రత్యేక ప్రార్థనల్లో టీడీపీ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రేమవిందులో అశ్మిత్‌రెడ్డి వడ్డించారు. ఆయన వెంట శిలాస్, వెంకటశివారెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, జేసీ సుదీప్‌రెడ్డి, ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాతిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, కౌన్సిలర్ విజయ్‌కుమార్, నారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

కుందుర్పి, జనవరి 20: అనంతపురం జిల్లాను కరువు జిల్లా ప్రకటించినా మండలాల్లో ఇంతవరకు కరువు సహాయక చర్యలు చేపట్టకపోవడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక అమ్మవారి దేవాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జాఫర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెట్టిన పంట పూర్తిగా ఎండిపోయి పెట్టుబడులు చేతికందక ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతుంటే ప్రభుత్వం సహాయక చర్యలు చేపడతామని చెప్పి ఇంతవరకు ఆ ఊసేలేకుండా పోయిందని విమర్శించారు. తాలుకా కార్యదర్శి గోపాల్, సహాయ కార్యదర్శులు వైగోపాల్, నరసింహులు, హరిదాసులు, శివలింగప్ప, రాందాసు, ఈరన్న, రఘువీరా, శామ్యూల్, మహేష్, మధు, నాగభూషణ, కవిత పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

కణేకల్లు, జనవరి 20: మండల కేంద్రంలోని దేవశెట్టి కాలువ వద్ద ఆర్టీసీ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. కణేకల్లు నుంచి వరిధాన్యం లోడుతో వెళుతున్న ఓ లారీ దేవశెట్టి కాలువ వద్ద ఉన్న 11కేవీ విద్యుత్ వైరును తెంచుకుని వెళ్లిపోయింది. దీంతో స్థానికులు వెంటనే విద్యుత్ కార్యాలయానికి ఫోన్ చేయించి సరఫరాను బంద్ చేయించారు. ఆ వెంటనే ఆర్టీసీ బస్సు రావడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయ్యింది.



విద్యుత్ వైరును తొలగిస్తున్న స్థానికులు

గణతంత్ర వేడుకలకు విద్యార్థి ఎంపిక

గుంతకల్లుటౌన్, జనవ రి 20: పట్టణంలోని ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో చదువుతున్న శ్రీకాంత్ అనే విద్యార్థి రాష్ట్ర గణతంత్ర వేడుకలలో పరేడ్ చేసేందుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య శనివారం తెలిపారు. కళాశాలలో బీకాం ఫైనల్ ఇయర్ చదువుతున్న శ్రీకాంత్ ఎన్‌సీసీ కేడెట్ విద్యార్థి విజయవాడలో 26న జరిగే గణతంత్ర వేడుకల్లో పరేడ్ చేయడానికి ఎంపిక అయ్యాడన్నారు. శ్రీకాంత్‌కు వైస్‌ప్రిన్సిపాల్ జనార్ధనశాస్త్రి, ఎన్‌సీసీ అధికారి బాలకృష్ణ, సూపరింటెండెంట్ మల్లికార్జునరావు అభినందించారు.

మాయమాటలు చెప్పి మోసగించారు



30వ వార్డు ప్రజలతో మాట్లాడుతున్న జితేంద్రగౌడు, టీడీపీ నాయకులు



కళ్యాణదుర్గం మండలం కామక్కపల్లిలో కరపత్రాలు పంచుతున్న ఉమా

● మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు

గుంతకల్లు, జనవరి 20: ఎన్నికలకు ముందు జగన్మోహన్‌రెడ్డి, వైసీపీ నాయకులు నోటికి వచ్చిన హామీలిచ్చేసి, అధికారంలోకి వచ్చాక ప్రజలను దారుణంగా మోసంచేశారని మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడు విమర్శించారు. పట్టణంలోని 30వ వార్డులో టీడీపీ, జనసేన నాయకులు భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. జితేంద్రగౌడు వార్డు ప్రజలతో మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చలేక జగన్ ప్రభుత్వం చతికిలబడిందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడపాలన్నా, సంక్షేమ కార్యక్రమాన్ని సంర్థవంతంగా ముందుకు నడపాలన్నా, యువతకు ఉద్యోగ, ఉపాధులు కల్పించాలన్నా చంద్రబాబు వల్లే సాధ్యమౌతుందన్నారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్ కుమార్ గౌడు, నాయకులు అనిల్ కుమార్ గౌడు, రాంతేజ్ గౌడు, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, టీ కేశప్ప, హనుమంతు, గుడిపాటి అంజనేయులు, రంజాన్, ఫజులు, గిడ్డయ్య, రామన్న చౌదరి, బండి లక్ష్మీదేవి, అంజలి, బీ రాము, ముక్కన్నగారి రామాంజనేయులు, జనసేన నాయకులు జీవన్, సురేశ్ పాల్గొన్నారు.

జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపుదాం: ఉమా

కళ్యాణదుర్గం: రాష్ట్రాన్ని దోచుకోవడమే ధ్యేయంగా మార్చుకున్న 420 జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపుదామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని కామక్కపల్లిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. నేడు ఎక్కడ చూసినా వైసీపీ ప్రభుత్వాన్ని చీదరించుకునే స్థాయికి వెళ్లిందంటే పరిపాలన ఏ విధంగా ఉందో అర్థం అవుతోందన్నారు. చంద్రబాబుపాలనను ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారని, టీడీపీ విజయం తథ్యమన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

గుత్తి: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును గెలిపిస్తేనే రాష్ట్ర భవిష్యత్తు ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్ అన్నారు. గుత్తి ఆర్ఎస్‌లోని 5వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైన దుస్థితిని ప్రజలకు వివరించారు. అవినీతి అక్రమాల్లో కూరుకుపోయిన వైసీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో చరమగీతం పాడాలన్నారు. వార్డు ఇన్‌చార్జి రాము, డాక్టర్స్ సెల్ నాయకులు రంగారెడ్డియాదవ్, కుల్లాయప్ప, సుంకన్న, కిట్టా, వెంకటశివుడు, వెంకటస్వామి, పవన్, శేఖర్, మహేష్, రమణ, రమేష్, కదిరప్ప, వాల్మీకి రాము, హరిచంద్ర, సునీల్, ఆచారి పాల్గొన్నారు.

పామిడి: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనను ఓటు రూపంలో అణిచివేద్దామని మాజీ కౌన్సిలర్ వైయా రామాంజనేయులు అన్నారు. పట్టణంలోని 7వ వార్డులో శనివారం టీడీపీ, జనసేన నాయకులు బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. వైసీపీ ప్రభుత్వం అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు, దోపిడీపై ప్రజలకు వివరించారు. జనసేన మండల అధ్యక్షుడు ధనుంజయ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి వడ్డే శివకుమార్, మోదీన్, దూదు, యుగంధర్, మస్తాన్, సూరి, శివారెడ్డి, మాధవ, షేక్షావలి, భాస్కర్‌గౌడ్, అఫ్జల్, అశోక్ పాల్గొన్నారు.



గుత్తి ఆర్ఎస్‌లో ప్రచారం చేస్తున్న వెంకటశివుడు యాదవ్



పామిడిలో...

అప్పుడే నూరేళ్లు నిండాయా నాయనా...

● ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం... విద్యార్థి మృతి
● మరో ఇద్దరికి గాయాలు
● మిన్నంటిన తల్లిదండ్రుల రోదనలు



కుమారుడి మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లిదండ్రులు



మహేంద్ర(ఫైల్)

కళ్యాణదుర్గం, జనవరి 20: ఒక్కగానొక్క కొడుకువే... అప్పుడే నీకు నూరేళ్లు నిండాయా నాయనా అంటూ ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ముగ్గురు ఆడపిల్లల తరువాత కొడుకు పట్టడంతో అల్లారు ముద్దుగా పెంచుకున్నారు. ఆటో రూపంలో ఆ చిన్నారిని మృత్యువు కబళించింది. తల్లిదండ్రులకు పుత్రశోకాన్ని మిగిల్చింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కంబదూరు మండలం ఎం.కుర్లపల్లికి చెందిన ముగ్గురు స్నేహితులు మనోహర్ (4వ తరగతి) మహేంద్ర (5వ తరగతి), భాను ప్రసాద్ (6వ తరగతి) చదువుతున్నారు. చిన్నప్పటి నుంచి కలిసిమెలిసి తిరిగేవారు. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆడుతూ పాడుతూ గడిపారు. మధ్యాహ్నం సమయంలో కర్ణాటక ప్రాంతానికి చెందిన ఆటో నీళ్ల కోసం ఆ దారిలో వెళ్తోంది. ఆ ఆటోలో ఆ ముగ్గురు స్నేహితులు ఎక్కారు. అప్పటికే డ్రైవర్ వేగంగా ఆటోను నడుపుతున్నాడు. దీనికి తోడు ఆ డ్రైవర్ చెవిటివాడు అని తెలిసింది. ఆటోలో ఎక్కిన విద్యార్థులను చూసి డ్రైవర్ దిగిపోండి అని గట్టిగా అరవడంతో పాటు ఆటోను నిలబెట్టకుండా అలాగే నిర్లక్ష్యంగా వేగంగా వెళ్లాడు. డ్రైవర్ అరుపులకు బెదిరిన ముగ్గురూ నడుస్తున్న ఆటో నుంచి కిందకు దూకారు. దీంతో ముగ్గురూ గాయపడ్డారు. వీరికి గాయాలైనట్లు గుర్తించిన డ్రైవర్ ఆటోను అక్కడే నిలిపి పరారయ్యాడు. సంఘటనకు సంబంధించి పిల్లల తల్లిదండ్రులకు సమాచారం అందడంతో, వెంటనే వైద్యం కోసం కంబదూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అప్పటికే మహేంద్ర (12) మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీం తో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. తల్లిదండ్రులు కొల్లప్ప, వరాలమ్మలకు ముగ్గురు కుమార్తెలు మైత్రి, కావ్య, కీర్తన తర్వాత కొడుకు మ హేంద్ర పుట్టాడు. అంతలోనే ఆ తల్లిదండ్రులకు పుత్రశోకాన్ని మిగిల్చిం ది. మరో విద్యార్థి భాను ప్రసాద్‌ను మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మనోహర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కంబదూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి


గుత్తిరూరల్ జనవరి 20: మండలంలోని చేర్లోపల్లికి చెందిన అభిరామ్(14) అనే విద్యార్థి శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు... గ్రామానికి చెందిన హరికృష్ణ, లక్ష్మీదేవిల కుమారుడు అభిరామ్ గుత్తికోట పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సాయంత్రం అభిరామ్ ద్విచక్రవాహనంలో గ్రామం నుంచి సేవాఘడ్ పాఠశాల వద్దకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు పాఠశాల ప్రహరీని ఢీకొట్టడంతో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు వారు తెలిపారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

12 మద్యం బాటిళ్లు సీజ్

యల్లనూరు, జనవరి 20: మండలంలోని బుక్కాపురం గ్రామంలో శనివారం మద్యం విక్రయిస్తున్న లక్ష్మమ్మ నుంచి 12 మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ ధరణీబాబు తెలిపారు. అలాగే మండలకేంద్రంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి రూ.2560 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించి మద్యం విక్రేతను, పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగించవద్దు

గుత్తి, జనవరి 20: వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగించే విధానాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. మండల కార్యదర్శి రామదాసు మాట్లాడుతూ వర్షాభావంతో సాగు చేసిన పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇలాంటి తరుణంలో వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగించి రైతులపై ప్రభుత్వం భారం మోపడం తగదన్నారు. నియోజకవర్గ సహాయ కార్యదర్శి రమేష్, పట్టణ కార్యదర్శి రాజు, మధుసూదన్‌రావు, నరసింహయ్య, నజీర్, సురేష్, మహ్మద్‌అలీ, మాబు, రామకృష్ణ పాల్గొన్నారు.



విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

'ఆడుదాం ఆంధ్రా'లో గొడవ


కణేకల్లు, జనవరి 20: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రాలో క్రీడాకారుల మధ్య గొడవ చోటు చేసుకుంది. మండలంలోని యర్రగుంట, కణేకల్లు నేసేపేట టీం మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగగా నేసేపేట టీం గెలుపొందింది. మ్యాచ్ ప్రారంభానికి ముందు యర్రగుంట జట్టులో వలంటీర్లు పాల్గొనగా నేసేపేట టీం అభ్యంతరం తెలపడంతో వలంటీర్‌లను మ్యాచ్ నుంచి తొలగించారు. నేసేపేట టీంలో ఓ తాత్కాలిక ఉద్యోగి ఆడడంతో యర్రగుంట టీం అభ్యంతరం వ్యక్తం చేసింది. అప్పటికే మ్యాచ్ ముగిసి కణేకల్లు జట్టు గెలుపొందింది. యర్రగుంట టీం మ్యాచ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. దీంతో తీవ్ర వాదోపవాదాలకు దారి తీసి ఇరు జట్ల మధ్య గొడవకు ఆస్కారం అయింది. పోలీసులు స్థానిక వైసీపీ నాయకులు అక్కడకు చేరుకుని ఇరుజట్లను సంయమనం పరచడానికి ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం కాస్తా గొడవ పడదాం ఆంధ్రాగా క్రీడాకారులు విసుక్కుంటున్నారు.



క్రీడాకారులకు సర్దిచెబుతున్న వైసీపీ నాయకులు

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

తాడిపత్రిటౌన్, జనవరి 20: పట్టణంలోని విజయనగర్‌కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థిని అక్షయ (17) శనివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. సోమేశ్వరరావు, ధనలక్ష్మి దంపతుల కుమార్తె అక్షయ పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. విద్యార్థిని చదువుకోకుండా ఎప్పుడూ సెల్‌ఫోన్ చూస్తుండడంతో తల్లి మందలించింది. తీవ్ర మనస్తాపం చెందిన అక్షయ శనివారం మధ్యాహ్నం ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సోమేశ్వరరావు, ధనలక్ష్మిలకు ఇద్దరు కుమార్తెలు కాగా అక్షయ రెండో కుమార్తె. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మృతిచెందిన విద్యార్థిని అక్షయ

కొనసాగిన బస్సుయాత్ర



గంజిగుంటపల్లిలో మహిళలతో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్ రెడ్డి

పెద్దవడుగూరు, జనవరి 20: మండలంలో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి చేపట్టిన యువచైతన్య బస్సుయాత్ర 4వరోజు శనివారం కొనసాగింది. గంజిగుంటపల్లి, చిట్టూరు, దిమ్మగుడి, చిన్నవడుగూరు గ్రామాల్లో బస్సుయాత్ర నిర్వహించారు. ఆయా గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జేసీకి ఘనస్వాగతం పలికారు. ఆయన ప్రజల యోగక్షేమాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల అభివృద్ధి ఐకమత్యంతోనే సాధ్యమన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. చిట్టూరులో గ్రామస్థులతో కలిసి జేసీ భోజనం చేశారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకులు దివాకర్‌రెడ్డి, రాజారెడ్డి, రామిరెడ్డి, శంకర ఉన్నారు. మండలంలోని కొండూరు గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన శనివారం సత్యసాయి వాటర్ పైపులైన్‌కు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు.

వైసీపీ పాలనలో కార్మికులు పస్తులుండాల్సిందే

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు



శ్రీరామిరెడ్డి కార్మికులతో కలిసి నినాదాలు చేస్తున్న ఓబులు

కళ్యాణదుర్గం, జనవరి 20: వైసీపీ పాలనలో పనులు చేయాలంటే కార్మికులు పస్తులుండాల్సిన దుస్థితి నెలకొందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు అన్నారు. శనివారం కళ్యాణదుర్గం శ్రీరామిరెడ్డి పంపుహౌస్ వద్ద కార్మికులు చేపడుతున్న నిరవధిక సమ్మెకు ఓబులు మద్దతు పలికారు. పంపుహౌస్ వద్ద వంటావార్పుకు ఉపయోగించే పాత్రలు పెట్టి వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఫేస్-4 కింద ఉన్న కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 120 మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారన్నారు. సమ్మె ప్రభావంతో 224 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. గ్రామాల్లో దాహార్తి కేకలతో ప్రజలు అల్లాడిపోతున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని విమర్శించారు. గత 15 ఏళ్లుగా ఈ పథకంలో కార్మికులుగా పనిచేస్తున్నా, నెలనెలా జీతాలు, ఇతరత్రా ప్రయోజనాలు కల్పించడంలో అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయారు. కార్మికులకు మద్దతుగా సీఐటీయూ అండగా ఉంటుందన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా జయసింహ

గుంతకల్లుటౌన్, జనవరి 20: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ మండల అధ్యక్షుడిగా నాగసముద్రం గ్రామానికి చెందిన ఎం జయసింహకు నియామక పత్రాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ అందజేశారు. జయసింహ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీజేపీలో చేరి మండల అధ్యక్షుడిగా బాధ్యతలను చేపట్టానన్నారు. పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్, కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుర్రం సూర్యనారాయణ, ఓబీసీ మోర్చా మహేష్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశపరీక్ష

ఉరవకొండ, జనవరి 20: పట్టణంలో శనివారం ఆరో తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన నవోదయ ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 249మంది విద్యార్థులకు గానూ 172 మంది హాజరయ్యారు. కొన్ని గదుల్లో వెలుతురు లేకపోవడంతో విద్యార్థులు చీకట్లోనే పరీక్ష రాయల్సి వచ్చింది.

కూడేరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

కూడేరు, జనవరి 20: కూడేరు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ అన్బురాజన్ తనిఖీ చేశారు. శనివారం ఉరవకొండ నుంచి తిరిగి వస్తూ కూడేరు స్టేషన్ తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. రానున్న రోజుల్లో సమష్టిగా పనిచేయాలని, సమస్యాత్మక గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మండలంలో పలు అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

మార్కెట్‌యార్డ్ కార్యదర్శిగా శ్రీనివాసులు

రాయదుర్గం, జనవరి 20: రాయదుర్గం మార్కెట్‌యార్డ్ కార్యదర్శిగా శ్రీనివాసులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సునీత కర్నూలు జిల్లా ఆలూరు మార్కెట్‌యార్డ్ గ్రేడ్-3 నుంచి గ్రేడ్ 2గా ఉద్యోగోన్నతి పొంది బదిలీపై వెళ్లారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు మార్కెట్‌లో అసిస్టెంట్ సెక్రెటరీగా పనిచేస్తున్న శ్రీనివాసులు గ్రేడ్-3 సెక్రెటరీగా ఉద్యోగోన్నతి పొంది రాయదుర్గం మార్కెట్‌యార్డ్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ రాయదుర్గం మార్కెట్ యార్డ్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

శ్రీరాముడి ఉత్సవాలు ప్రారంభం



ర్యాలీలో పాల్గొన్న పురప్రముఖులు, ప్రజలు

తాడిపత్రిటౌన్, జనవరి 20: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని జై శ్రీరామ్ భక్తమండలి ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం శ్రీరాముడి ఉత్సవాలు ప్రా రంభమయ్యాయి. పట్టణంలోని వాల్మీకి సర్కిల్ నుంచి పట్టణ పోలీస్ స్టేషన్, అశోక్‌పిల్లర్, అభయాంజనేయ స్వామి విగ్రహం మీదుగా మెయిన్ బజారు, గాంధీకట్ట వరకు భక్తులు, విద్యార్థులు, ప్రజలు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల చేత హనుమాన్ చాలీసా పారాయణం చేస్తూ నగర సంకీర్తన చేశారు. జై శ్రీరామ్ భక్తమండలి అధ్యక్షుడు రాధాకృష్ణ, బీజేపీ సీనియర్ నాయకుడు అంకాల్‌రెడ్డి, కార్యదర్శి శింగి రి లక్ష్మీనారాయణ, అంజనేయులు, గంగాధర్‌యాదవ్, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.



గుత్తిలో రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



ఆందోళనకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు



రాయదుర్గంలో...



తాడిపత్రిలో...

అంగన్‌వాడీల రాస్తారోకో

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు పలు ప్రాంతాల్లో రాస్తారోకోలు నిర్వహించారు. కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 40వ రోజుకు చేరుకుంది. గుత్తిలో అంగన్‌వాడీలు రాస్తారోకో చేస్తుండగా పోలీసులు అడ్డుకుని వారిని అరెస్టు చేశారు. పలుపాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్



కణేకల్లులో...



గుంతకల్లులో ర్యాలీ...



కళ్యాణదుర్గంలో మానవహారం...